వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ కార్యాలయం ఎదుటప్లకార్డులతో నిరసన తెలపుతున్న ఉద్యోగులు

ఆ హాస్టల్‌లో కష్టాలెన్నో...

- పసుపు నీళ్లే పప్పుగా..ఉప్మాలో పురుగులు, వ్యర్థాలు... - మెనూ అమలు గాలికి
- శుద్ధి లేకుండానే వంటనీరు.. తాగునీరు వినియోగం... - విద్యార్థులకు తప్పని అవస్థలు
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

పేదలకు విద్యను పెంపొందించే దిశగా ప్రవేశపెట్టిన ప్రభుత్వ వసతిగృహ లక్ష్యం నీరుగారుతోంది. పేదలన్న నిర్లక్ష్యమో?, అడిగే వారు ఎవరున్నారనే అహంకారమో? విషయం ఏదైనా ఇక్కడ విద్యార్థులకు మాత్రం అవస్థలు తప్పడం లేదు. నగరం నడిబొడ్డులో నగర మేయర్ క్యాంపు కార్యాలయానికి ఎదురుగా కూతవేటు దూరంలో ఆ వసతి గహం ఉంది. అక్కడ విద్యార్థులకు ఎదురవుతున్న సమస్యలు ఏ అధికారికి, ప్రజా ప్రతినిధికి పట్టడం లేదు. ఇంతకీ ఈ హాస్టల్ ఏదనుకుంటున్నారా? ఎక్కడ అనుకుంటున్నారా? అదే ప్రభుత్వ మైనార్టీ సంక్షేమ కళాశాల వసతి గృహం.

జిల్లాలో మైనార్టీ సంక్షేమ పోస్టు మెట్రిక్ వసతిగృహాన్ని కర్నూలు నగరం, గణేష్‌నగర్ లోని మేయర్ క్యాంప్ కార్యాలయానికి అతి సమీపంలో ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇందులో ఇంటర్, డిగ్రీ, పీజీ, సహా వివిధ వృత్తివిద్య కోర్సులు చదివే మైనారిటీ విద్యార్థులకు ప్రవేశాలను కల్పించింది. మొత్తం 50 సీట్లను మంజూరు చేయగా అందులో సుమారు 49 మందికి అడ్మిషన్లు కల్పించినట్లు తెలుస్తోంది. ఇక్కడ విద్యార్థులకు వసతి, భోజనం కల్పిస్తోంది. భోజనం కోసం ఒక విద్యార్థికి రోజుకు రూ. 54 చొప్పున ప్రభుత్వం కేటాయిస్తోంది. ప్రభుత్వం ప్రవేశపెట్టిన మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాన్ని పెట్టాల్సి ఉంది. కాని అదిపాటించరు.

హాస్టల్ భవనం

పట్టికకే పరిమితమైన మెనూ

విద్యార్థులకు ప్రతిరోజు ఏఏ భోజనం పెట్టాలో సంబంధిత వివరాలను తెలియజేసే మెనూ ప్రస్తుతం అక్కడ కేవలం పట్టికకే పరిమితమైంది. అమలులో మాత్రం దానిని పట్టించుకోరు. ప్రస్తుతం హాస్టల్లో విద్యార్థులు సగటున 36 మంది నుంచి 40 మంది దాకా హాజరు ఉంటుంది. ప్రతిరోజు విద్యార్థులకు ఉదయం పాలు ఇవ్వాల్సి ఉండగా 40 మందికి కలిపి అర లీటర్ తోనే సరిపెడుతున్నారు. అంటే పాలు ఎంత చిక్కగా ఉంటాయో అర్థం చేసుకోవచ్చు. పెరుగుకు బదులు మజ్జిగ నీళ్లు పోస్తున్నారు. ప్రతిరోజు అరటి జామ లేదా స్థానికంగా లభించే ఏదైనా ఓ పండును విద్యార్థులకు ఇవ్వాల్సిఉండగా గడచిన రెండు నెలల్లో కేవలం రెండు రోజులు మాత్రమే పండ్లను విద్యార్థులకు పంపిణీ చేశారు. చిక్కీలు అసలే ఇవ్వలేదు. కూరగాయలు 40 మందికి కలిపి కేవలం అరకిలో మాత్రమే వినియోగిస్తున్నారు. పప్పు విషయానికి వస్తే పసుపు నీళ్లను తలపిస్తోంది.

ఉప్మాలో పురుగులు, వ్యర్థాలు

ఇక్కడ విద్యార్థులకు తినే తిండిలో పురుగులు కనిపించడం సర్వసాధారణమైన విషయంగా ఉంది. ఇటీవల కాలంలో విద్యార్థులకు వండిన ఉప్మాలో పురుగులు కొల్లలుగా కనిపించాయి. దీనికి తోడు విద్యార్థులకు మధ్యాహ్నం పెరుగు స్థానంలో అందిస్తున్న మజ్జిగలోనూ దోమ లార్వాలు ఈత కొడుతూ కనిపిస్తున్నాయి. విద్యార్థులకు తాగునీరు, వంటకు సరఫరా చేసే సింటెక్స్ ట్యాంక్‌ను కూడా శుభ్రం చేయడంలో తీవ్రంగా నిర్లక్ష్యం కనిపిస్తోంది. ఏడాదిలో కనీసం ఒక్కరోజు కూడా ట్యాంకును శుభ్రపరచిన దాఖలాలు లేనట్లు కనిపిస్తోంది. ట్యాంకుపై కనీసం మూతను కూడా ఏర్పాటు చేయకపోవడంతో దోమ లార్వాలు, కీటకాలు కాపురం చేస్తున్నాయి. వీటన్నిటిని స్థానిక అధికారుల దృష్టికి విద్యార్థులు తీసుకువెళ్లినా సర్దిచెప్పి పంపడం తప్పమార్పు ఏ మాత్రం కనిపించడం లేదని విద్యార్థులు ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. పైగా విద్యార్థులను బెదిరించే దిశగా ఆయా కళాశాలల యాజమాన్యానికి ఫిర్యాదు చేసి బుకాయించే ప్రయత్నం ఇక్కడి అధికారులు చేస్తున్నారని సమాచారం. ఇప్పటికైనా సమస్యలను పరిగణలోకి తీసుకొని పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని విద్యార్థులు తమ ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు.

అన్నంలో పురుగు

ఈ తిండి తినలేక పోతున్నాం

- మునీర్ బాషా, హాస్టల్ విద్యార్థి

హాస్టల్లో పెట్టే భోజనం ఆకలిని తట్టుకోలేక తింటున్నాం. భోజనంలో పురుగులు వస్తున్నాయి. అధికారులకు ఎన్నోసార్లు మొరపెట్టుకున్నాం ఫలితం లేకుండా పోయింది.

నీళ్ల చారులా పప్పు

-అక్బర్, హాస్టల్ విద్యార్థి

పప్పు నీళ్ల చారులా ఉంటుంది. పెరుగుకు బదులుగా నీళ్ల మజ్జిగ పోస్తున్నారు. కూరగాయలు కూరలో వెతుక్కోవాల్సిందే.

నీళ్ల ట్యాంకు శుభ్రపరచరు

-రహీం, హాస్టల్ విద్యార్థి

వంట కోసం తాగునీటి కోసం వినియోగించే వాటర్ ట్యాంకును ఏడాదికాలంలో శుభ్రపరచిన దాఖలాలే కనిపించలేదు. ట్యాంకు కనీసం మూత కూడా లేదు. దోమలు, కీటకాలు, కనిపిస్తున్నాయి.

హాస్టల్లో సమస్యలు పరిష్కరించాలి

-అబ్దుల్లా, ఎస్‌ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి

మైనార్టీ పోస్ట్ మెట్రిక్ సంక్షేమ హాస్టల్ విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి. విద్యార్థులకు మెనూ సక్రమంగా అమలు చేయాలి. అధికారులు వెంటనే జోక్యం చేసుకొని సమస్యను పరిష్కరించాలి. లేదంటే సమస్యలపై ఉద్యమిస్తాం.

కొత్త అధికారి అవన్నీ చూస్తారు

-మహాలక్ష్మి, ఇన్చార్జి వసతి గహ అధికారి

ఈ సమస్యలు నేను రాకముందు నుంచే ఉన్నాయి. సమస్యను అధికారుల అందరి దృష్టికి విద్యార్థులు తీసుకెళ్లారు. తక్కువ సంఖ్యలో విద్యార్థులు ఉండడం వల్ల ఈ సమస్య తలెత్తుతోంది. నేను కేవలం ఇన్చార్జి గా మాత్రమే బాధ్యతలు చూస్తున్నాను. త్వరలో వచ్చే రెగ్యులర్ అధికారి అవన్నీ చూసుకుంటారు.

ఉద్యోగుల బదిలీలు వాయిదా వేయాలి

వాణిజ్య పన్నుల శాఖ సర్వీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

ఉద్యోగుల బదిలీలు వాయిదా వేయాలని రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. మంగళవారం కర్నూలు జాయింట్ కమిషనర్ కార్యాలయం ముందు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు దశరథ రఘురామిరెడ్డి ,కార్యదర్శి అబ్దుల్ సాహెబ్ మాట్లాడారు. గత ప్రభుత్వంలో ఈ శాఖలో 2.0 ఆర్గనైజేషన్ పేరుతో జరిగిన అన్యాయాలను, రాజ్యాంగ వ్యతిరేకంగా, రాష్ట్రపతి ఉత్తర్వులకు భిన్నంగా జరిగిన ఉద్యోగుల బదిలీలను రద్దు చేస్తూ సదరు సిబ్బందిని వారి సొంత 'యూనిటీ ఆఫ్ అపాయింట్ మెంటు' స్థానాలకు బదిలీలు చేసి మరలా సర్కిల్ వ్యవస్థను పరిపుష్టత తరిగి తీసుకురావాలన్నారు. జిఎస్‌టిఒలకు సరైన వర్క్ ఫంక్షన్స్ ఏర్పాటు చేయాలని, రీజినల్ ఆఫీసులను రద్దు చేయాలని, పునర్వవస్థీకరణ పేరుతో జరిగిన అరాచకం, విధ్వంసంపై దర్యాప్తు చేయాలని ప్రభుత్వానికి విన్నవించారు. దీనిపై న్యాయం చేయాలని అంతవరకూ బదిలీలను వాయిదా వేయాలని కోరారు. ప్రాంతీయ కార్యాలయాల వ్యవస్థ రద్దు చేయాలని, గత ప్రభుత్వంలో పలువురు అధికారులు పన్ను ఎగవేతదారులకు సహకరించినందున ప్రభుత్వ ఖజానాకు తీరని నష్టం జరిగిందన్నారు. ఐఎఎస్ పోస్టులో నాన్ ఐఎఎస్‌ను కూర్చోబెట్టి నిబంధనలు అతిక్రమించారన్నారు. కొత్త కమిషనర్ వచ్చిన అనంతరమే ఉద్యో గులకు బదిలీలు చేపట్టాలని కోరుతూ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా నిరసనలు చేపట్టామన్నారు. అప్పటిదాకా బదిలీలు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యక్షులు మురళీకృష్ణ, డి చంద్రశేఖర్ , పి.రమేష్ బాబు , పాణిగ్రహి, రాష్ట్ర ఇసి మెంబర్ సిద్ధిక్ ,మహిళా కార్యవర్గ సభ్యులు టి.మహాలక్ష్మి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఆనంద్‌బాబు

సామాజిక హక్కుల

సాధనకు ఉద్యమం

- కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.ఆనంద్‌బాబు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

జిల్లా వ్యాప్తంగా పరిపూర్ణ సంఘ నిర్మాణం ద్వారా సామాజిక హక్కుల సాధనకు మరింత పటిష్టంగా ఉద్యమిద్దామని కెవిపిఎస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్. దేవసహాయం, ఎండి.ఆనంద్‌బాబు అన్నారు. మంగళవారం కర్నూలు కార్మిక కర్షక భవన్‌లో కెవిపిఎస్ జిల్లా కమిటీ సమావేశం ఆ సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.దేవసహాయం అధ్యక్షతన నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.ఆనంద్ బాబు మాట్లాడుతూ పటిష్ట సంఘ నిర్మాణం ద్వారా మాత్రమే దళితుల సామాజిక సమస్యలపై, ప్రజాతంత్ర హక్కులపై మరింత బలమైన ఉద్యమాలను నిర్మించి, పరిష్కరించుకోగలుగుతామ న్నారు. అందులో భాగంగానే జిల్లా వ్యాప్తంగా పటిష్ట సంఘ నిర్మాణాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. ఇప్పటిదాకా జిల్లా వ్యాప్తంగా ఉన్న గ్రామ, వార్డు కమిటీలకు తోడు ప్రతి దళితపేటలోనూ సంఘాన్ని ఏర్పాటు చేయాలన్నారు. అనుబంధ సంఘాలుగా ఉన్న మహిళల రాష్ట్ర సదస్సును విజయవాడలోనూ, కాటికాపరుల రాష్ట్ర సదస్సును హిందూపురంలోనూ, చర్మకారుల రాష్ట్ర సదస్సును భీమవరంలోనూ నిర్వహిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర సదస్సుల లోపు జిల్లా వ్యాప్త అనుబంధ సంఘాల నిర్మాణాన్ని కూడా చేపట్టాలన్నారు. జిల్లాలో దళితులపై జరుగుతున్న దాడుల పట్ల పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. దళితుల సమస్యల పరిష్కార దిశగా జిల్లావ్యాప్తంగా నిర్మాణయుతమైన పోరాటాలను నిర్వహించాలన్నారు. కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు డి.విజయమ్మ, బి.కరుణాకర్, సహాయ కార్యదర్శులు ఎం. భాస్కర్, ఆర్.పెద్దబాబు, ఎం.చిన్న మారయ్య, జిల్లా నాయకులు రోశయ్య, ఏసురాజు, జె.మద్దిలేటి, చక్రపాణి, గర్జి అంజి, రమణ, ఈశ్వరయ్య, వెంకటేశ్వర్లు, నాగరాజు, ఏసన్న, బైరాపురం కృష్ణ, ప్రకాశం పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సర్దుబాటుపై అసహనం

- నేడు డివిజన్ స్థాయిలో కౌన్సిలింగ్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

విద్యాశాఖ చేపడుతున్న ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియపై ఉపాధ్యాయులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివరకు విద్యాశాఖ చేపట్టిన ఉపాధ్యాయ సర్దుబాటులో గందరగోళం జరిగిందని ఉపాధ్యా యులు వాపోతున్నారు. సీనియారిటీ లెక్కింపులో సీనియారిటీ ఉన్న వారికి అన్యాయం జరిగినట్లు ఉపాధ్యాయ వర్గాలే పేర్కొంటున్నాయి. కర్నూలు జిల్లాలో మండల పరిషత్ జిల్లా పరిషత్, ప్రభుత్వం మున్సిపల్ పాఠశాలలు 2242 దాకా ఉన్నాయి. ఈ పాఠశాలలో దాదాపుగా8216 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. వాస్తవానికి జిల్లాలో ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు బోధించేందుకు 2500 మంది ఉపాధ్యాయులు అవసరం ఉంది. కొన్ని చోట్ల అదనంగా 258 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. ఉపాధ్యాయ సర్దుబాటులో కేవలం 250 మంది ఉపాధ్యాయులను మాత్రమే చేపడుతున్నారు. బుధవారం జిల్లాలోని డివిజన్ స్థాయిలో ఉపాధ్యాయుల సర్దుబాటుపై కౌన్సిలింగ్ నిర్వహించేందుకు విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

సమావేశ:ఖక్ష మాట్లాడుతుతున్న అసిస్టెంట్ కమిషన్ చంద్రభూషణ్

ఓపెన్ స్కూల్లో పేర్ల నమోదుకు ఆహ్వానం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఓపెన్ స్కూల్లో టెన్త్ , ఇంటర్మీడియట్ ప్రవేశాలకు నమోదు చేయించాలని పరీక్షలు విభాగం అసిస్టెంట్ కమిషనర్ చంద్రభూషణ్ అన్నారు. మంగళవారం నాడు ఓర్వకల్లోని మండల పరిషత్ కార్యాలయం సమావేశపు హాలులో ఓపెన్ స్కూల్ ప్రవేశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పరీక్షలు విభాగం అసిస్టెంట్ కమిషనర్ చంద్రభూషణ్ తో పాటు మండల విద్యాశాఖ అధికారి ఓంకార్ యాదవ్ మాట్లాడుతూ మండలంలో బడి బయట ఉన్న పిల్లలందరూ ఓపెన్ స్కూల్లో పేర్లు నమోదు చేసుకొని పరీక్షలు హాజరు కావచ్చని అన్నారు . ఓపెన్ స్కూల్ సర్టిఫికెట్ రెగ్యులర్ 10వ తరగతి , ఇంటర్మీడియట్‌తో సమానమన్నారు. ఈ సర్టిఫికెట్లు ఉన్నత అభ్యాసానికి ఉపయోగపడతాయన్నారు.

పక్షవాతానికి, బ్రెయిన్ స్ట్రోక్‌కు ఇకపై చెక్!

డాక్టర్ రోహిత్, ఇంటర్వెన్షనల్ న్యూరాలజిస్ట్ ఆర్ఆర్ హాస్పిటల్

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్



అత్యాధునిక చికిత్స పద్ధతులు ఉపయోగించడం ద్వారా పక్షవాత ప్రభావం మళ్లీ రాకుండా నివారిస్తుందని ఇంటర్వెన్షనల్ న్యూరాలజిస్ట్ డాక్టర్ రోహిత్ తెలిపారు. కర్నూలు ఆర్ఆర్ హాస్పిటల్ ఆయన ప్రజాశక్తితో తెలిపిన వివరాల ప్రకారం... పక్షవాతం , బ్రెయిన్ స్ట్రోక్‌తో ఎనిమిది నెలలుగా బాధపడుతున్న పేషంట్ దానికి సంబంధించిన మాత్రలు వాడుతున్న కూడా ఉపయోగం లేకపోవడంతో ఒకసారి డాక్టర్ రోహిత్ దగ్గర దాని గురించి చెప్పారు. ఆయన దానికి సంబంధించిన టెస్టులు చేసి అదనంగా బ్రెయిన్ ఎంజాయోగ్రామ్ టెస్టులో మెదడు నరాల్లో రక్త సరఫరా జరగకపోవడం వల్ల రోగికి ఇబ్బంది కలుగుతుందని గ్రహించారు. దానివల్ల ఇచ్చిన మందులు కూడా ప్రభావం చూపెట్టలేదని తేల్చి 'హైరిస్క్ స్టంటింగ్' పద్ధతిలో రక్తనాళం మూతపడిన ప్రదేశంలో "యాంజియో ప్లాస్టింగ్" చేసి స్టంట్ వేశారు. ఈ చికిత్స తర్వాత ముందెన్నడూ లేని విధంగా రోగి కోలుకున్నారు. రాయలసీమలో మొట్టమొదటిగా ఈ పద్ధతిని వాడడం జరిగింది. అత్యాధునిక చికిత్స పద్ధతులు ఉపయోగించడం ద్వారా పక్షవాత ప్రభావం మళ్లీ రాకుండా నివారిస్తుందని నిరూపించారు.

క్రీడలతో క్రమశిక్షణ ,ఏకాగ్రత

అంతర్ పాఠశాలల కబడ్డీ పోటీలను ప్రారంభించిన డాక్టర్ శంకర్ శర్మ

ప్రజాశక్తి-కర్నూలు జిల్లా పరిషత్

విద్యార్థుల్లో క్రమశిక్షణ ఏకాగ్రతను పెంచగలిగే శక్తి కేవలం క్రీడలకు మాత్రమే ఉందని సీనియర్ గ్యాస్ట్రోఎంట్రాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ అన్నారు. కర్నూల్ నగరంలోని స్పోర్ట్స్ అథారిటీ మైదానంలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాటుచేసిన అంతర్ పాఠశాలలకు కబడ్డీ పోటీలను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో పాల్గొనడం వల్ల శారీరక మానసిక ఆరోగ్యం మెరుగుపడి చదువులోనూ రాణిస్తారని చెప్పారు. ముఖ్యంగా క్రీడల్లో పాల్గొనే విద్యార్థుల్లో ఏకాగ్రత, క్రమశిక్షణ పెంపొంది వారు ఉత్తమ పౌరులుగా ఎదుగుతారని అన్నారు. ఈ దేశ భవిష్యత్తు నేటి బాలలపైనే ఆధారపడి ఉందని ,వారు క్రీడల్లో పాల్గొనడం వల్ల దేశానికి ఉపయోగపడే పౌరులుగా ఎదుగుతారని వివరించారు. ప్రస్తుతం సెల్ ఫోన్ లాంటి డిజిటల్ మీడియాకు విద్యార్థులు బానిసలుగా మారుతున్నారని ,అదే ఒక ప్రపంచంగా జీవిస్తున్నారని, దీనివల్ల ఎన్నో అనార్థాలు కలుగుతున్నాయని వివరించారు. అలా కాకుండా క్రీడల్లో పాల్గొనడం వల్ల శరీరానికి వ్యాయామం కలిగి ఎంతో మేలు జరుగుతుందని వివరించారు. ప్రపంచంలోని మిగతా దేశాలతో పోలిస్తే మనదేశంలో విద్యార్థుల్లో సంతోష సూచిక తక్కువగా ఉందని వివరించారు. విద్యార్థుల్లో హ్యాపీనెస్ ఇండెక్స్ పెరగడం వల్ల ఎంతో ఉపయోగం ఉంటుందని వివరించారు. ప్రపంచంలోని చిన్న చిన్న దేశాలు కూడా ఒలంపిక్స్ లో పతకాలను సాధిస్తున్నాయని, 140 కోట్ల జనాభా ఉండి ప్రపంచాన్ని శాసించే స్థాయిలో ఉన్న మన దేశం ఆశించిన స్థాయిలో పతకాలను సాధించలేకపోతుందన్నారు. అందుకే చిన్ననాటి నుంచి క్రీడలలో సాధన చేయాలన్నారు. క్రీడలను ప్రోత్సహిస్తున్న ప్రతి ఒక్కరిని ఆయన అభినందించారు .ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారికి ఈ నెల 29న జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా బహుమతులను అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు బొల్లవరం రామాంజనేయులు, ప్రముఖ న్యాయవాది శ్రీధర్ రెడ్డి, కబడ్డి కార్యదర్శి చిన్న సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డాక్టర్ శంకర్‌శర్మ

రైతులకు అన్యాయం చేస్తే సహించం

మార్కెట్ సెక్రెటరీ కార్నోలీస్

ప్రజాశక్తి-పత్తికొండ

రైతులు పండించిన పంటకు కనీస మద్దతు ధర కల్పించకుండా అన్యాయం చేస్తే సహించబోమని వ్యాపారస్తులపై పత్తికొండ సెక్రటరీకార్నోలీస్ మండిపడ్డారు. పత్తికొండ వ్యవసాయ మార్కెట్లోని వ్యాపారస్తులు రైతులు పండించిన టమోటా, పచ్చిమిర్చి వేలంపాటను పత్తికొండ సెక్రటరీ కార్నోలీస్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన పంటకు కనీస మద్దతు ధరతో పంటను కొనుగోలు చేయాలని అన్నారు. రైతులను మోసం చేస్తే లైసెన్సులను రద్దు చేస్తామని అన్నారు. పంట కొనుగోలులో ఎలాంటి అవకతవకలు జరిగినా వెంటనే అధికారులు దృష్టికి తీసుకురావాలని రైతులను కోరారు.

నేరాల నియంత్రణకు కృషి

నేర సమీక్ష సమావేశంలోఎస్‌పి బిందుమాధవ్
ఉత్తమప్రతిభకు ప్రశంసా పత్రాలు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

నేరాల నియంత్రణకు కృషి చేయాలని, పెండింగ్ కేసులు తగ్గించాలని జిల్లా ఎస్‌పి జి.బిందు మాధవ్ సూచించారు. మంగళవారం కర్నూలు జిల్లా పోలీసు కార్యాలయంలో వ్యాస్ ఆడిటోరియంలో డిఎస్‌పిలు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, సిఐలు, ఎస్ఐలతో ఎస్‌పి నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎస్‌పి మాట్లాడుతూ కర్నూలు, పత్తికొండ, ఆదోని, ఎమ్మిగనూరు సబ్ డివిజన్‌లలో దీర్ఘకాలంగా ఉన్న పెండింగ్ కేసుల గురించి ఎస్‌పి ఆరా తీశారు. పోలీసుస్టేషన్ల వారీగా కేసుల పెండింగ్‌కు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. పోలీసు, న్యాయ శాఖలు కలిసి కోర్టులో పెండింగ్ ఉన్న కేసుల దర్యాప్తులను త్వరితగతిన పూర్తిచేయడానికి తీసుకోవలసిన చర్యల గురించి వారికి పలు సలహాలు,సూచనలు చేశారు. ఇప్పటినుండే ప్రాపర్టీ రికవరీలు బాగా చేయాలన్నారు. అలసత్వం ప్రదర్శిస్తే వచ్చే నెల నేర సమీక్షా సమావేశంలో శాఖ పరమైన చర్యలు తీసుకుంటామన్నారు. పోలీసుస్టేషన్లను ఆశ్రయించే బాధితుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. ఎస్ఐ ఆ పై స్థాయి అధికారులు బాధితులతో మాట్లాడి సమస్యలు పరిష్కరించే విధంగా చేయాలన్నారు.పాత నేరస్తులపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. వినాయకచవితి, దసరావంటి పండుగలను ప్రజలు ప్రశాంత వాతావరణంలో జరుపుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. విగ్రహాల దగ్గర సిసి కెమెరాలు, కాపాల ఒకరు ఉండే విధంగా వినాయక విగ్రహాల నిర్వహకులు చర్యలు తీసుకునే విధంగా చేయాలన్నారు. శాంతియుత సమావేశాలు ఏర్పాటు చేయాలని, అన్ని శాఖల సమన్వయంతో బందోబస్తు ప్రణాళిక ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. నిమజ్జనాలకు ట్రాఫిక్ అంతరాయం లేకుండా చూసుకోవాలన్నారు. పోలీసు గస్తీ, విజిబుల్ పోలీసింగ్ పెంచాలని అన్నారు. ఫ్యాక్షన్ ప్రభావిత గ్రామాలలో పికెట్‌లలో ఎలాంటి సమస్యలు లేకుండా గట్టినిఘా ఉంచాలని చెప్పారు. అసాంఘిక కార్యక్రమాల పై గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. డిఎస్‌పిలు ఆయా సర్కిల్స్ పోలీసు అధికారులకు కాలపరిమితి నిర్ణయించి కేసులను పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. మహిళల పట్ల జరిగే నేరాల పై ప్రత్యేక దృష్టి సారించి నివారించాలన్నారు. దొంగలించబడిన కేసులలో ప్రాపర్టీ రికవరీలు చేయా లన్నారు. పెండింగ్ కేసులు త్వరగా పూర్తి చేయాలన్నారు. సిసిటిఎన్ఎస్ గురించి అందరూ తెలుసుకోవాలి. సిసిటిఎన్ఎస్ కేసుల వివరాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలన్నారు. కౌంటర్ ఫీట్, ఎన్‌డిపీస్, మర్డర్ , రోడ్డు ప్రమాదాలు , నాన్ బెయిలబుల్ వారెంట్లు, మిస్సింగ్ కేసుల గురించి అడిగి తెలుసుకున్నారు.

ప్రతిభ కనబరచిన పోలీసులకు ఎస్‌పి అభినందన

విధుల్లో ప్రతిభ కనబరచిన పోలీసులను ప్రతి నెల నేర సమీక్షా సమావేశంలో అభినందిస్తామన్నారు. అత్యవసర , విపత్కర పరిస్థితులలో మానవత్వంతో స్పందించి ఆదుకొని ప్రజల మన్ననలు పొందాలన్నారు. గాజుల దిన్నె చెరువులో ఐరన్ బండ , గంజిహళ్ళి గ్రామ రైతులు చెరువు నీటిలో చిక్కుకున్న 32 మంది ప్రజల ప్రాణాలు కాపాడిన గోనెగండ్ల పోలీసులను అభినందించారు. సిఐ ఎ.గంగాధర్ , హెడ్ కానిస్టేబుల్ డి.శ్రీరాములు, కానిస్టేబుల్స్ బ్రహ్మయ్య, వెంకటేశ్వర్లుకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కర్నూలులో గంజాయి అమ్మేవాళ్ళ ను పట్టుకొని జైలుకు పంపినందుకు కర్నూలు మూడవ పట్టణ ఎస్ఐ మన్మథ విజయన్ ను అభినందించి ప్రశంసా పత్రం అందజేశారు. గూడురుకు చెందిన బంగారం వ్యాపారి దమామ్ వెంకటేశ్వర్లు కిడ్నాప్ కేసునుచేధించేందుకు సహకరించిన(అప్పట్లో నాగాలాపురం ఎస్సై) కోడుమూరు ఎస్ఐ ఎపి శ్రీనివాసులు చేసిన కృషిని అభినందించారు. లీగల్ అడ్వైజర్ మల్లికార్జునరావు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, డిఎస్‌పిలు జె.బాబు ప్రసాద్, కె.శ్రీనివాసాచారి, వెంకట్రామయ్య, సోమన్న, ట్రైనీ డిఎస్‌పి ధీరజ్, సిఐలు , ఎస్ఐలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి బిందు మాధవ్

ఉత్సవాలను విజయవంతంగా చేపట్టండి

- ఇన్‌ఛార్జ్ సబ్ కలెక్టర్ విశ్వనాథ్

ప్రజాశక్తి - ఆదోని

సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌ఛార్జ్ కలెక్టర్

గణేష్ ఉత్సవాలను విజయ వంతంగా చేపట్టాలని ఆదోని ఇన్‌ఛార్జ్ సబ్ కలెక్టర్ సి.విశ్వనాథ్ పేర్కొన్నారు. మంగళవారం ఆదోని మున్సిపల్ కార్యాలయం లో ఆదోని డివిజన్ స్థాయి అధికారులు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో ఉత్సవాల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సెప్టెంబర్ 7న వినాయక చవితి పండగ సందర్భంగా భక్తులకు ఎటువంటి ఇబ్బందులూ కలుగకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఆదోని పట్టణంలో 11న జరిగే నిమజ్జనంలో అన్ని శాఖల అధికారులూ సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలన్నారు. గణేష్ ఉత్సవాల్లో తాగునీరు, విద్యుత్, లైటింగ్, శానిటేషన్, ఇబ్బందులు లేకుండా చూడాలని తెలిపారు. నిమజ్జనం వెళ్లే రోడ్డులో ఏదైనా గుంతలుంటే వాటిని గుర్తించి మరమ్మతులు చేపట్టాలని ఆర్అండ్‌బి అధికారులను ఆదేశించారు. ప్రజలకు విద్యుత్ అంతరాయం కలుగకుండా చర్యలు చేపట్టాలన్నారు. నిమజ్జనం దగ్గర గతంలో కంటే ఎక్కువ సంఖ్యలో క్రేన్లు అందుబాటులో ఉంచాలని తెలిపారు. అలాగే గజ ఈతగాళ్ల ను అందుబాటులో ఉంచాలన్నారు. మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, డిఎల్‌డిఒ నాగేశ్వరరావు, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శిశిర దీప్తి, సిఐ గంటా సుబ్బారావు, డిప్యూటీ తహశీల్దార్ రుద్ర గౌడ్, ఉత్సవ కమిటీ నాయకులు గోవిందరాజులు, కునిగిరి నీలకంఠ, నాగరాజు, శ్రీనివాస్ ఆచారి ఉన్నారు.

ఎం.కొట్టాలలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - ఆలూరు

వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న అద్భుత కుమార్

మండలంలోని ఎం.కొట్టాల గ్రామంలో మంగళవారం ఎపి అగాపే మిషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని గుత్తిశాల పాస్టర్ రెవరెండ్ అద్భుత కుమార్ ప్రారంభించారు. మంగళవారం ఆయనకు గ్రామంలో క్రైస్తవులు, సిఎస్ఐ సంఘం పెద్దలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇలాంటి సేవా కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. పాస్టర్ సత్యానందం, జోయల్, భాస్కర్, సంఘ పెద్దలు దేవపుత్ర, ఆశీర్వాదం, దాసప్ప, ఆనంద్, అగ్రహారం ఆనంద్, రాజు, విక్రమ్ బాబు, ధర్మన్న యూత్ సభ్యులు ప్రసాద్, బెన్ని, రాజు, కిమ్స్ వైద్యులు పాల్గొన్నారు.

ఉరుకుంద హుండీ లెక్కింపు

- రూ.1.06 కోట్ల ఆదాయం

ప్రజాశక్తి - కౌతాళం

శ్రీనరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి శ్రావణమాస ఉత్సవాలు సందర్భంగా హుండీ లెక్కింపు చేపట్టినట్లు డిప్యూటీ కమిషనర్ గురు ప్రసాద్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడారు. భక్తులు స్వామి వారికి నగదు రూ.1,00,09,030, అన్నదానం హుండీల నగదు రూ.6,68,500, మొత్తం కలిపి రూ.1,06,77,530 సమర్పించుకున్నట్లు తెలిపారు. బంగారం 8 గ్రాములు, వెండి 22 కిలోల 400 గ్రాములు వచ్చినట్లు చెప్పారు. అసిస్టెంట్ చీఫ్ ఫెస్టివల్ అధికారి పాండురంగా రెడ్డి, హుండీ పర్యవేక్షణ అధికారి ఎస్.వెంకటేష్ పాల్గొన్నారు.

ప్రజలు, కార్మిక సంఘాలు మెచ్చేది 'ప్రజాశక్తి'నే

- తహశీల్దార్ ఇజాజ్ అహ్మద్

ప్రజాశక్తి - చిప్పగిరి

ప్రజాశక్తి పత్రిక అంటే ప్రజలు, ప్రజా సంఘాలు, కార్మికులు ఎనలేని అభిమానం చూపుతారని, ప్రజాశక్తి ప్రజల పక్షపాతిగా ఉంటుందని ఇన్‌ఛార్జ్ తహశీల్దార్ ఇజాజ్ అహ్మద్ తెలిపారు. మంగళవారం ప్రజాశక్తి 44వ వార్షికోత్సవం ప్రత్యేక సంచికను చిప్పగిరి తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ ఇజాజ్ అహ్మద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 44 వసంతాలు ప్రజల పక్షాన ఉంటూ నిజాలను నిర్భయంగా, నిజాయితీగా రాసి పత్రిక విలువలను పెంచుతూ పత్రికల్లోనే ప్రజాశక్తి ప్రత్యేకతను చాటుకుందన్నారు. సమాజంలో జరిగే మంచి, చెడులను ప్రజలకు తెలియజేసినప్పుడే పత్రిక విలువ పెరుగుతుందని తెలిపారు. సీనియర్ అసిస్టెంట్ మధుస్వామి, విఆర్ఒలు మల్లికార్జున, రంగన్న, తిమ్మప్ప, కిష్టప్ప, ఈరన్న, పెద్దన్న, చంద్ర నాయక్ పాల్గొన్నారు.

సంచికను ఆవిష్కరిస్తున్న తహశీల్దార్

పేరుకే మండల కేంద్రం

- అడుగడుగునా సమస్యలే
- చిప్పగిరి మండలం నుంచి వరుసగా మూడుసార్లు ఎమ్మెల్యేలు ఎన్నిక
- బస్టాండ్ వసతి కరువు - క్రీడా మైదానం కూడా కరువే..!

పశ్చిమ ప్రాంతంలో వెనుకబడిన మండలాల్లో చిప్పగిరి, హోలహర్వి పేర్లు ప్రముఖంగా వినిపిస్తాయి. పేరుకే మండల కేంద్రంగా చిప్పగిరి ఉంది. అభివృద్ధిలో మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. ఇక్కడి నుంచి మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. చిప్పగిరిని అభివృద్ధి చేయలేకపోయారని మండల వాసులు విమర్శిస్తున్నారు.

ప్రజాశక్తి - చిప్పగిరి

చిప్పగిరి మండల జిల్లా పశ్చిమ ప్రాంతంలో ఉంది. పేరుకు మాత్రమే మండల కేంద్రంగా ఉందంటూ ఇక్కడి ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిప్పగిరి మండలం నుంచి ఏకంగా మూడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. చిప్పగిరిలో చెప్పుకోవడానికి ఏదైనా పెద్ద అభివృద్ధి పనులు చేశారా అంటే అదీ లేదు. వాటర్ ట్యాంకు దగ్గర నుంచి ఎస్సీ కాలనీ వరకు ఇప్పటికీ సిసి రోడ్డు వసతి లేదు. అలాగే గ్రంథాలయం పక్కన ఉన్న రహదారిలో సిసి రోడ్డు లేక మురుగునీరు, మట్టి బురదలోనే ప్రజలు నడవాల్సిన దుస్థితి నెలకొంది. చిప్పగిరి వాసులు బస్సు ఎక్కడానికి రోడ్డు దగ్గరకొస్తే, బస్సు సమయానికి రాకపోతే కనీసం కూర్చోవడానికి బస్టాండు కూడా లేదు. హోటల్‌లోనూ, రోడ్డు పక్కన ఉన్న కాంప్లెక్స్ మెట్ల మీద కూర్చునే పరిస్థితి ఉంది. బస్టాండ్ దగ్గర కనీసం తాగునీటి వసతి కూడా లేదని పలు గ్రామాల నుంచి పనులు మీద కార్యాలయాలకు వచ్చే ప్రజలు వాపోతున్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ కళాశాల ఉన్నప్పటికీ చిప్పగిరిలో విద్యార్థులకు క్రీడలు ఆడుకోవడానికి మైదానం కూడా లేదు. విద్యార్థులు క్రీడల్లో వెనుకబడి పోతున్నారని పూర్వపు విద్యార్థులు పేర్కొంటున్నారు. తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం ఇప్పటికీ ప్రజాప్రతినిధులు చూపడం లేదు. ఇప్పటికీ 15 రోజులకోసారి తాగునీరు సరఫరా చేస్తున్నారు. పూర్వ కాలంలో తాగడానికి నీరు దొరకాలంటే ఎన్నో ఇబ్బందులు పడే వారు. చివరకు దిగుడు బావుల్లో, వంకలో ఉన్న ఇసుకలో టెంకాయ చిప్పలతో తోడేసుకునేవారమని పలువురు పెద్దలు చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే శాసనాల్లో శిల్ప గిరిగా ఉన్న పేరు రాను రాను చిప్పగిరిగా మారిపోయిందని పెద్దలు తెలియజేస్తున్నారు. భోగేశ్వర, చెన్నకేశవ దేవాలయాలకు ఇనాం భూములు ఉన్నాయి. శిథిలావస్థకు చేరుకున్న చెన్నకేశవ దేవాలయ మరమ్మతులకు నోచుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. వెలుగు కార్యాలయం, రైతు సేవా కార్యాలయానికి సరైన సిసి రోడ్డు లేక ఇబ్బందులు పడుతున్నామని ఉద్యోగులు తెలుపుతున్నారు. ఈ సమస్యలన్నీ ప్రజాప్రతినిధులు దృష్టి సారించి పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

బురదమయంగా ఉన్న రహదారి

తాగునీటికి చాలా ఇబ్బందులు

- తిక్కన్న, చిప్పగిరి గ్రామం

పూర్వకాలంలో తాగడానికి నీరు దొరకక దిగుడు బావుల్లో అడుగు బాగాన ఉన్న నీటిని మెట్ల నుంచి కిందికి దిగుతూ టెంకాయ చిప్పతో మట్టి కడవల్లోకి తోడేసుకునేవారని మా పెద్దలు తెలుపుతున్నారు. ఆ నీటి సమస్యతోనే శిల్పగిరిగా ఉన్న గ్రామం పేరు రాను రాను చిప్పగిరిగా మారిపోయిందని మా పూర్వీకులు చెప్పగా విన్నాం.

కూరగాయలకు గిట్టుబాటు ధర కరువు

- రైతులు విలవిల

ప్రజాశక్తి - దేవనకొండ

కూరగాయలకు గిట్టుబాటు ధర కరువైంది. ధర లేకపోవడంతో రైతులు విలవిల్లాడుతున్నారు. ఈఏడాది ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు చేసిన కూరగాయ పంటలైన టమోటా, చిక్కుడు, బెండ, చోళకాయ, వంకాయలకు గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతుల పెట్టిన పెట్టుబడులు సైతం రాక విలవిల్లాడుతున్నారు.

మండలంలోని దేవనకొండ, పల్లెదొడ్డి, కె.వెంకటాపురం, గద్దెరాళ్ల, కుంకనూరు, జిల్లేడుబుడకల, కరివేముల, కూకటికొండ తదితర గ్రామాల్లో రైతులు వందలాది ఎకరాల్లో కూరగాయల పంటలను సాగు చేశారు. పంటల నాటు,

కలుపు, రసాయనిక, పిచికారి మందుల కోసం వేలాది రూపాయలు ఖర్చు పెట్టారు. పంటల కోసం పెట్టుబడి పెడితే పంట చేతికొచ్చే సమయానికి గిట్టుబాటు ధరలు లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. చోళకాయ, బెండకాయ, చిక్కుడు, పచ్చి మిరపకాయను 25 కిలోల సంచి మార్కెట్‌లో అమ్మకానికి తీసుకెళ్తే రైతులకు కేవలం రూ.100 నుంచి రూ.150 ప్రకారం మాత్రమే లభిస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బయట కూరగాయల వ్యాపారం చేసే వారి దగ్గర మాత్రం టమోటా కిలో రూ.10, బెండకాయ కిలో రూ.20, చోళకాయ కిలో రూ.20, చిక్కుడుకాయ కిలో రూ. 20 ప్రకారం విక్రయిస్తున్నారు. రైతులకు మాత్రం కిలో రూపాయి ప్రకారం మాత్రమే లభిస్తోంది. గిట్టుబాటు ధర లభించకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

గ్రామేతరునికి 'ఎస్టీ' ధ్రువీకరణ పత్రం

- నకిలీ పత్రాలతో అధికారులను బురిడీ కొట్టించిన ఘనుడు

ప్రజాశక్తి - కౌతాళం

తహశీల్దార్ కార్యాలయంలో పని జరగాలంటే అధికారుల చుట్టూ తిరిగి తిరిగి అలసిపోతుంటారు. కుల ధ్రువీకరణ పత్రం పొందాలంటే ఒకటికి రెండుసార్లు అధికారులు విచారణ చేసిన తర్వాతే మంజూరు చేస్తారు. విచారణ చేయకుండానే గ్రామేతరునికి ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రం మంజూరు చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. జరిగిన తప్పిదాలను ఆలస్యంగా తెలుసుకున్న అధికారులు ఆ వ్యక్తిని పిలిపించుకొని మంజూరు చేసిన ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రాన్ని వెనక్కి తీసుకున్నారు.

కర్నూలుకు చెందిన నల్లగోది శ్రీనివాసులు నకిలీ ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రంతో ఉపాధ్యాయ ఉద్యోగం పొందాడు. తప్పుడు ఆధార్ కార్డును సృష్టించి దాని ఆధారంగా మండలంలోని బదినేహాల్ గ్రామ వాసిగా తహశీల్దార్ కార్యాలయంలో ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రం కోసం దరఖాస్తు చేసుకున్నాడు. ఆ దరఖాస్తును విఆర్ఒ సూర్య నారాయణ రెడ్డి విచారించకుండా సంతకం చేసి తహశీల్దార్ వద్దకు చేర్చారు. విఆర్ఒ సంతకంతో దరఖాస్తుపై తహశీల్దార్ మల్లికార్జున స్వామి కూడా శ్రీనివాసులుకు ఎరుకలి కులం ఎస్టీ సర్టిఫికెట్ మంజూరు చేశారు. ఎస్టీ సర్టిఫికెట్ పొందిన శ్రీనివాసులు మరో రెండు సర్టిఫికెట్లను ఉన్నతాధికారులకు సమర్పించాల్సి ఉండగా, అనుమానం వచ్చిన విఆర్ఒ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, సదరు వ్యక్తిపై గ్రామంలో విచారణ చేపట్టారు. అలాంటి పేరు గల వ్యక్తి ఎవరూ లేరని గ్రామస్తులు అధికారులకు తెలిపారు. అధికారులు వెంటనే స్పందించి శ్రీనివాసులుకు ఫోన్ చేసి తమ వద్దకు రప్పించుకున్నారు. అతను పొందిన కుల ధ్రువీకరణ పత్రాన్ని వెనక్కి తీసుకున్నారు. ఆధార్ కార్డు ఎలా సృష్టించావని ఆరా తీశారు. ఆ వ్యక్తి వివరాలను సేకరించగా, ఆ వ్యక్తి మోసాన్ని బట్టబయలు చేశారు. తాను చేసిన తప్పును అధికారుల ముందు ఒప్పుకున్నాడు. ఈ విషయంపై తహశీల్దార్ మల్లికార్జున స్వామిని వివరణ కోరగా... గతంలో పెండింగ్‌లో ఉన్న కుల ధ్రువీకరణ పత్రంలో ఈ వ్యక్తి దరఖాస్తు కూడా రావడంతో సంతకం చేసినట్లు తెలిపారు. విచారణ చేయకుండా తహశీల్దార్ వద్దకు దరఖాస్తు పంపిన విఆర్ఒపై శాఖ పరమైన చర్యలు, అధికారులను మోసం చేసిన శ్రీనివాసులుపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

శ్రీమఠంలో హుండీ లెక్కింపు పూర్తి

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలోని శ్రీరాఘవేంద్రస్వామి మఠంలో చేపట్టిన హుండీ లెక్కింపు ప్రక్రియ పూర్తయినట్లు శ్రీమఠం మేనేజర్ ఎస్‌కె.శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడారు. ఆగస్టు నెలలో రాఘవేంద్రస్వామి దర్శనార్థమై దేశ నలుమూలల నుంచి వచ్చిన భక్తులు కానుకల రూపంలో హుండీలో వేసిన ఆదాయాన్ని దేవదాయ, ధర్మాదాయ శాఖ, శ్రీమఠం అధికారుల సమక్షంలో లెక్కించినట్లు తెలిపారు. 29 రోజుల హుండీ ఆదాయం నగదు రూపంలో రూ.3,23,44,480, బంగారం 156 గ్రాములు, వెండి 1,273 గ్రాములు వచ్చినట్లు చెప్పారు.

బీవీపై ఆరోపణలు చేస్తే సహించేది లేదు

- మాజీ కౌన్సిలర్, టిడిపి పట్టణ ఉపాధ్యక్షులు రంగస్వామి గౌడ్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

టిడిపి విజయాన్ని, ఎమ్మెల్యే బీవీ భారీ విజయాన్ని జీర్ణించుకోలేక కొంతమంది ఆరోపణలు చేస్తున్నారని, అలాంటి వారిని సహించేది లేదని మాజీ కౌన్సిలర్, టిడిపి పట్టణ ఉపాధ్యక్షులు రంగస్వామి గౌడ్ హెచ్చరించారు. మంగళవారం ఆయన మాట్లాడారు. ఎమ్మిగనూరు అభివృద్ధి రెండుకళ్లుగా భావించే బీవీ కుటుంబంపై తప్పుడు ప్రకటనలు చేస్తున్నారని మండిపడ్డారు. కోనేరు నాగేంద్ర ప్రసాద్ లెటర్ ప్యాడ్‌లో టిడిపిపై తప్పుడు రాతలు రాస్తూ పబ్బం గడుపుతున్నారని, ఈ రోతరాతలు ఎమ్మిగనూరు ప్రజలు ఎవరూ నమ్మరని తెలిపారు. 'నీవు నీ స్వార్థం కోసం కీర్తిశేషులు ఎన్‌టిఆర్ ఫొటో అడ్డం పెట్టుకుని లెటర్ ప్యాడ్ వాడుకుంటున్నావు. ఇప్పటి నుంచి కోనేరు నీ ఆటలు సాగవు' అని హెచ్చరించారు. 'నువ్వు ఎలాంటి వ్యక్తివో ఎమ్మిగనూరు ప్రజలకు తెలుసు. తప్పుడు రాతలు ఎవరూ నమ్మరు. టిడిపిపై, ఎమ్మెల్యే బీవీ గురించి మాట్లాడితే తాట తీస్తాం' అని తెలిపారు. అలాగే ఇసుక, మట్టి, గరుసు దోపిడీ జరుగుతుందని, అప్పా డీల్ అంటూ ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే రోడ్డుపైకి లాగాల్సి వస్తుందని హెచ్చరించారు. ఏదైనా రాయాలనుకుంటే వాస్తవాలు తెలుసుకొని రాయాలని హితవు పలికారు. కొంతమంది టిడిపిని డ్యామేజ్ చేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. ప్రజలకు ఉపయోగపడే ప్రకటనలు విడుదల చేయాలని తెలిపారు.

విద్యుదాఘాతంతో వలస కూలీ మృతి

ప్రజాశక్తి - కౌతాళం

కూలి పని కోసం వలస వెళ్లి, విద్యుదాఘాతంతో మృతి చెందిన సంఘటన మంగళవారం చోటు చేసుకోంది. మండలంలోని గుడికంబాలి గ్రామానికి చెందిన నాగేష్, బాజమ్మ కుమారుడు అంజా అనే యువకుడు బెంగళూరుకు వలస వెళ్లారు. భవనంపై పనిచేస్తున్న సమయంలో విద్యుదాఘాతానికి గురై మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

పోరాటాల ఫలితమే తుంగభద్ర నదిపై బ్రిడ్జి కం బ్యారేజీ : రైతుసంఘం

ప్రజాశక్తి - కౌతాళం

తుంగభద్ర నదిపై సమాంతర వరద కాలువ, లేక బ్రిడ్జి కం బ్యారేజీ నిర్మించాలని రైతు సంఘం ఆధ్వర్యంలో ఎన్నో పోరాటాలు చేసిన ఫలితంగా నేడు కర్ణాటక ప్రభుత్వం మంజూరు చేసిందని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మల్లయ్య పేర్కొన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కౌతాళం మండలం అన్ని రంగాల్లోనూ వెనుకబడిన ప్రాంతమని, మండలంపై రాజకీయ నాయకులు ప్రత్యేక శ్రద్ధ పెట్టలేదని తెలిపారు. ఇప్పటివరకు ఇరిగేషన్‌పై దృష్టి సారించలేదన్నారు. వరద కాలువ నిర్మించాలని, లేదా బ్రిడ్జి కం బ్యారేజీ నిర్మిస్తే ఈ ప్రాంతం సస్యశ్యామలం అవుతుందని రైతు సంఘం అనేక పోరాటాలు చేసినట్లు తెలిపారు. తహశీల్దార్లకు, నాయకులకు, జిల్లా స్థాయి అధికారులకు, రాష్ట్రస్థాయిలో ఇరిగేషన్ మినిస్టర్‌కు, ముఖ్యమంత్రులకు విన్నవించినా ఏ ప్రభుత్వమూ స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తుంగభద్ర నదిలో వరద జలాలు వృథా అవుతున్నా ఎవరూ పట్టించుకోలేదన్నారు. వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేసి రైతులను ఆదుకోవాలని ఏ పార్టీ కూడా ముందుకు రాలేదన్నారు. కేవలం రైతు సంఘం మాత్రమే మేళిగనూరు నుంచి కలెక్టరేట్ వరకు వందలాది మంది రైతులతో పాదయాత్ర నిర్వహించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ప్రస్తుతం కర్ణాటక ప్రభుత్వం రైతులను దృష్టిలో ఉంచుకొని బ్రిడ్జి కం బ్యారేజీ మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. టిడిపి ప్రభుత్వం కూడా కర్ణాటక ప్రభుత్వం మాదిరిగా స్పందించి ఆంధ్రా వైపు కాలువలు నిర్మించి రైతులను ఆదుకోవాలని కోరారు.

మాట్లాడుతున్న మల్లయ్య

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలోని శ్రీరాఘవేంద్రస్వామి మఠంలో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మంగళవారం శ్రీమఠం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థుల ఆధ్వర్యంలో శ్రీగురు సార్వభౌమ సంస్కృత విద్యాపీఠం విద్యార్థులు శ్రీమఠం ఆవరణలోని యోగీంద్ర సభా మండపం వద్ద రంగు నీళ్ల చల్లకుంటూ ఉట్టిని కొట్టే ప్రయత్నం చేస్తూ సంబరాలతో కనువిందు చేశారు. ముఖ్య అతిథులుగా వచ్చిన పీఠాధిపతులు ఉట్టిని కొట్టి విద్యార్థుల్లో ఉత్సాహం నింపారు. అంతకుముందు శ్రీమఠంలో పీఠాధిపతులు శ్రీకృష్ణునికి విశేష పూజలు నిర్వహించారు. మఠం ప్రిన్సిపల్ వాదిరాజాచార్, జోనల్ మేనేజర్ శ్రీపతి ఆచార్ పాల్గొన్నారు. **ఆలూరు** మండలంలోని మొలగవల్లి గ్రామంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. స్వామి వారికి గోపూజ, కుంకుమార్చన, మహా మంగళహారతులు ఇచ్చారు. టిడిపి నాయకులు వీరభద్ర గౌడ్, మహిళా నాయకులు వైకుంఠం జ్యోతిలు గ్రామానికి చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. గ్రామానికి చెందిన గాజుల ఉమాకాంత్ కుటుంబ సభ్యులు స్వామి వారి ఆలయ నిర్మాణానికి రూ.లక్ష చెక్కు రూపంలో అందజేశారు. యాదవ సంఘం నాయకులు రంగస్వామి యాదవ్, రామనాథ్ యాదవ్, అశోక్, నరసన్న, అంజినయ్య, యంకన్న, నరసప్ప, హనుమంతు, నాగేష్, ఈరప్ప, ఐకాంత్, జలందర్, శివ స్వామి, భూపేష్, శీనప్ప, నాగప్ప, షేకన్న, లింగన్న, జ్ఞాని, వీరచంద్ర, సోమన్న, కర్రెన్న, గోపాల్, నరసింహ, చంద్ర, జగదీష్, కిష్టప్ప, బాబు, అఖిల్, రామకృష్ణ పాల్గొన్నారు.

మంత్రాలయంలో పాల్గొన్న పీఠాధిపతులు

ఆలూరులో ఊరేగుతున్న శ్రీకృష్ణుని విగ్రహం

దామాషా ప్రకారమే వర్గీకరణ

- జైభీమ్ ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు చిక్కం జానయ్య మాదిగ

ప్రజాశక్తి - మంత్రాలయం

జనాభా దామాషా ప్రకారమే ఎస్సీ వర్గీకరణ జరగాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని జైభీమ్ ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు చిక్కం జానయ్య మాదిగ పేర్కొన్నారు. మంగళవారం తహశీల్దార్ ఎ.రవి, ఎంపిడిఒ మణిమంజరి, హౌసింగ్ డిఇ లాలీ కృష్ణయ్యను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలో 21 పంచాయతీలు ఉండగా మాదిగలు అధిక సంఖ్యలో ఉన్నారని తెలిపారు. దళిత గిరిజనులకు రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు సంఘాలు, నాయకులు, అధికారులు వివక్షత చూపించకుండా నేరుగా లబ్ధిదారులకు చేకూర్చే విధంగా చేయాలని కోరారు. జై భీమ్ ఎంఆర్‌పిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గర్జి హనుమన్న మాదిగ, జిల్లా కార్యదర్శి రత్నం మాదిగ, మంత్రాలయం నియోజకవర్గ నాయకులు దేవరపాటి అనిల్ కుమార్, నాగేంద్ర, మంత్రాలయం టౌన్ అధ్యక్షులు గోపాల మాదిగ, మండల అధ్యక్షులు గాడిమోడు నరసింహులు మాదిగ, మండల కార్యదర్శి గర్జి ప్రకాష్ మాదిగ, మండల నాయకులు చెట్నుపల్లి అజయ్ పాల్గొన్నారు.

ఎంపిడిఒను సన్మానిస్తున్న నాయకులు

'రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణం చేపట్టాలి'

ప్రజాశక్తి - నందవరం

రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం గ్రామాల్లో రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణాన్ని చేపట్టి ప్రజల ఇబ్బందులను తొలగించాలని సిపిఐ నాయకులు పంపన్నగౌడ్ కోరారు. నందవరంలో రోడ్లను, డ్రెయినేజీ కాలువలను సిపిఐ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామంలో రోడ్లు, డ్రెయినేజీ కాలువలు నిర్మించడంలో గత వైసిపి ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. వీధిలో మురుగునీరు నిలవడం వల్ల ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని, వీధిలో నడవడానికి ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఈ సమస్యలను పరిష్కరించాలని కోరారు. గిడ్డయ్య, శాంతప్ప, ముని, భీమన్న, బంగారి, చిన్న రాముడు, మల్లేష్, ఐకొండ పాల్గొన్నారు.

'పాత పెన్షన్ విధానం అమలు చేయాలి'

ప్రజాశక్తి - ఆదోని

యుపిఎస్, జిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఎస్‌టియు రాష్ట్ర సహాధ్యక్షులు సి.నాగరాజు, రాష్ట్ర పురపాలక కమిటీ కన్వీనర్ జి.వీరచంద్ర యాదవ్, పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.రవి, భీమరాజు డిమాండ్ చేశారు. మంగళవారం ఆదోనిలోని నెహ్రూ మెమోరియల్ పురపాలక ఉన్నత పాఠశాలలో లోక్యానాయక్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. రెండు దశాబ్దాల క్రితం రద్దు చేసిన పాత పెన్షన్ విధానాన్నే తిరిగి చేపట్టాలని డిమాండ్ చేశాయి. కేంద్ర ప్రభుత్వం యుపిఎస్‌ను తెరపైకి తెచ్చి ఉద్యోగులను తప్పుదోవ పట్టిస్తోందని విమర్శించారు. ఒపిఎస్ కింద 20 ఏళ్ల సర్వీసు ఉంటే పూర్తి పెన్షన్ వచ్చేదన్నారు. పెన్షన్‌దారులకు పెన్షన్, డిఎల చెల్లింపులో అసాధారణ జాప్యం జరిగినా ఉద్యోగులు, పెన్షనర్లకు నష్టమేనని తెలిపారు. రాజాసతీష్, ప్రసాద్, విజయ్, ఉరుకుందప్ప, ప్రహ్లాద, నాగేష్, సుధాకర్ బాబు, వెంకటరామిరెడ్డి, శ్రీరాములు, మారయ్య పాల్గొన్నారు.

వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాడాలి

- మాలమహానాడు జిల్లా అధ్యక్షులు మహానంది



మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

ఎబిసిడి వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునకు వ్యతిరేకంగా మాలలు ఐక్యంగా పోరాటాలకు సిద్ధం కావాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షులు మహానంది, సాయిరాం కోరారు. మంగళవారం పట్టణంలోని బైపాస్ ఆవరణలో మాల మహానాడు పట్టణ కార్యదర్శి బొబ్బిలి అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. దళితుల ఐక్యతను దెబ్బతీసే విధంగా ఈనెల 1న సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడం విచారకరమని తెలిపారు. దళితుల మధ్య చిచ్చుపెట్టే విధంగా ఆ తీర్పు ఉందన్నారు. చాగి లింగప్ప, వెంకటరాముడు, భరత్, లింగంపల్లి మల్లికార్జున, ప్రహ్లాద, హనుమంతు, గిరి మల్లప్ప, చిగిలి వెంకటేష్ పాల్గొన్నారు.

తోవిలో ఓట్లు లెక్కిస్తున్న అధికారులు

ఎస్ఎంసి ఎన్నికల్లో లక్ష్మన్న గెలుపు

ప్రజాశక్తి - కౌతాళం

లక్ష్మన్న

మండలంలోని తోవి గ్రామంలో ఎస్ఎంసి ఎన్నికల్లో టిడిపి మద్దతుతో పోటీ చేసిన అభ్యర్థి లక్ష్మన్న 34 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. మండలంలో 59 పాఠశాలలకు గాను 58 పాఠశాలల్లో కమిటీలను ఎన్నుకున్నారు. తోవి ప్రాథమిక పాఠశాలకు ఎన్నికలు రెండుసార్లు వాయిదా పడ్డాయి. మంగళవారం ఎంఇఒ శోభారాణి ఆధ్వర్యంలో మూడోసారి ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో వైసిపి మద్దతుతో రంగస్వామి, టిడిపి మద్దతుతో లక్ష్మన్న పోటీ చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఎన్నికల్లో పాల్గొని ఓటు హక్కు వినియోగించుకున్నారు. 124 ఓట్లు పోలైనట్లు అధికారులు తెలిపారు. ఓట్లు లెక్కించగా రంగస్వామికి 45 ఓట్లు రాగా, లక్ష్మన్నకు 75 ఓట్లు వచ్చాయి. 34 ఓట్ల మెజార్టీతో లక్ష్మన్న గెలుపొందినట్లు ఎంఇఒ శోభారాణి ప్రకటించారు. ఈ ఎన్నికల సరళిని ఎంపిడిఒ సుబ్బారావు, తహశీల్దార్ మల్లికార్జున స్వామి పర్యవేక్షించారు. ఎస్ఐ మహ్మద్ రిజ్వాన్ పోలీసు సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

మీటర్ రీడర్ల సమస్యలు పరిష్కరించాలి

- డిప్యూటీ ఇంజినీర్‌కు వినతి

ప్రజాశక్తి - ఆదోని

విద్యుత్ శాఖలో మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించి వారి సమస్యలను పరిష్కరించాలని సీనియర్ నాయకులు కోరారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. నరసింహుడు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ రీజనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ భాస్కర్ మాట్లాడారు. మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రత కోసం, పని దినాలు పెంచుకునే విషయంలో ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. యువగళం పాదయాత్రలో లోకేష్ చేసిన వాగ్దానాలను నెరవేర్చాలన్నారు. అనంతరం ఆదోని డివిజన్ మీటర్ రీడర్స్ డివిజన్ కమిటీ ఏర్పాటు చేశారు. డివిజన్ ప్రధాన కార్యదర్శిగా వెంకటేశ్వర్లు, రాజు, కోశాధికారిగా ముని, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా లక్ష్మన్న, ఉపాధ్యక్షులుగా దశరథ్, జాయింట్ సెక్రటరీ సుధాకర్, బద్రి, ఫిరోజ్, చిరంజీవిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఆదోని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రాజేష్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకులు రాణి, వెంకటేష్ ఉన్నారు.

డిప్యూటీ ఇంజినీర్‌కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
44వ వార్షికోత్సవ ప్రత్యేక అనుబంధం - ఆళ్లగడ్డ
ఆగస్టు - 2024

44 ఏళ్ల ప్రజాశక్తి..



ప్రజాశక్తి విజయవాడ ఎడిషన్ ప్రారంభ సభలో మాట్లాడుతున్న పుచ్చలపల్లి సుందరయ్య

ప్రజాశక్తి - కర్నూలు ప్రత్యేక ప్రతినిధి

దోపిడీ రహిత సమ సమాజ నిర్మాణానికి 'ప్రతి అక్షరం... ప్రజల పక్షం' అన్న నినాదంతో నడుస్తున్న ప్రజాశక్తి దినపత్రికలోని ప్రతి అక్షరం ప్రజల పక్షంగానే ఉంటోంది. ప్రస్తుతం మన చేతుల్లో ఉన్న ప్రజాశక్తి దినపత్రిక 43 ఏళ్ల క్రితం పురుడు పోసుకున్నది. ప్రజాశక్తి పత్రిక జాతీయోద్యమ కాలం నుంచే వెలువడుతోంది. జాతీయోద్యమ కాలంలోనే 1942లో కమ్యూనిస్టు పార్టీ అధికార పత్రికగా మద్రాసులో మొదటిసారి ఆవిర్భవించింది. 1945 నుంచి విజయవాడ కేంద్రంగా ప్రజాశక్తి మొదలయింది. జాతీయోద్యమ నాయకులకు ప్రజాశక్తి పత్రిక కరదీపికగా మారడంతో బ్రిటీషు హయాంలో నిషేధానికి గురైంది. ఈ పత్రిక స్వాతంత్ర్యం వచ్చాక 1948లోనూ నిషేధానికి గురైంది. తెలంగాణ విముక్తి కోసం ప్రజాశక్తి నిర్వహించిన పాత్రపై అప్పటి పాలకులు తట్టుకోలేక నిషేధానికి గురిచేశారు. 1969లో వారపత్రికగా తిరిగి ప్రజాశక్తి పునఃప్రారంభమైంది. ఆ తర్వాత 1981 ఆగస్టు 1 నుంచి దినపత్రికగా రూపుదిద్దుకొని దాదాపు 4 దశాబ్దాలపాటు శ్రామిక వర్గం, శ్రామికవర్గానికి పీడిత, తాడితులకు, అభివృద్ధి కాముకులకు, అభ్యుదయ వాదులకు కరదీపికగా ప్రజాశక్తి కొనసాగుతోంది.

భూ పోరాటమైనా, వ్యవసాయ కార్మికుల కూలి పోరాటాలైనా, అన్నదాతల ఆకలి పోరాటాలకైనా, ఉద్యోగ, ఉపాధ్యాయుల హక్కుల కోసమైనా ప్రజాశక్తి 'నేనున్నాన'ంటూ వారికి అండగా నిలుస్తోంది. ప్రపంచీకరణ నేపథ్యంలో ప్రజలు, కష్టజీవులు పడే ఇబ్బందులను ఇతర పత్రికలు పక్కదోవ పట్టించే ప్రయత్నం చేసినా వాస్తవాలను ప్రతిబింబించేలా ప్రజాశక్తి ముందు వరుసలో నిలుస్తోంది. ఆయా వర్గాల ప్రజల మన్ననలతో ప్రజాశక్తి దినదినాభివృద్ధి చెందుతుంది. 1981లో మొదలైన ఈ పత్రిక

వార్త 3లో

వినూత్న రీతిలో జిల్లా అభివృద్ధికి చర్యలు

- ప్రజాశక్తితో కలెక్టర్ జి.రాజకుమారి

నంద్యాల జిల్లాలో ఉండే స్థానిక వనరులను సమర్థవంతంగా వినియోగించు కుంటూ ప్రజల జీవన ప్రమాణాలు పెరిగి ప్రతి కుటుంబానికి కనీసం రూ.25 వేల కనీస ఆదాయం వచ్చేలా ఐదు సంవత్సరాల కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా తెలిపారు. ప్రజాశక్తి 44 వ వార్షికోత్సం సందర్భంగా ప్రజాశక్తి తో కలెక్టర్ రాజకుమారి గణియా జిల్లా సమగ్రభివద్ధిపై జిల్లాలో చేపడుతున్న పలు కార్యక్రమాలను వివరించారు. ఆమె మాటల్లో....

వార్త 3లో



నాటి త్యాగాల మర్రి నేటి చాగలమర్రి

చాగలమర్రి ఏరియల్ వ్యూ

ప్రజాశక్తి - చాగలమర్రి

చాగలమర్రి పూర్వపు పేరు త్యాగాలమర్రి ఆ పేరు కాలానుగుణంగా చాకలమర్రి, చాగలమర్రిగా మారిందని పెద్దలు చెబుతారు. కడప కర్నూలు పరిసర ప్రంతాలకు చెందిన కలెక్టర్ బాప్టియన్ దొర పలువురు తిరుగుబాటు దారులను చాగలమర్రి ప్రాంతంలోని చెట్టుకొమ్మకు ఉరి బిగించారు. అనాటి మనవ త్యాగాలకు సాక్షిగా నిలుస్తుంది.

కీస్తుశకం 1424- 25లో సంవత్సరాల మధ్య కాలంలో శ్రీవెంకటేశ్వరునిపై 32 వేల సంకీర్తనలు చేసిన తాళ్లపాక అన్నమాచార్యులు దేశ సంచారం చేస్తూ చాగలమర్రిలోని చెన్నకేశవ ఆలయంలో ఒక సంకీర్తన రాశారు. ఈ ఆలయ నమూన ఉత్సవ విగ్రాహాలు తిరుమలలోని మ్యూజియంలో చూడవచ్చు. 1802 మార్చి 20న తామస్ మన్రోకు సమర్పించిన మెమోరాండం ప్రకారం సీడెడ్ జల్లాల్లో 80 మంది పాలేగాళ్లు ఉండేవారు. అందులో పది మంది చాగలమర్రి వాసులే. ఇందులో లక్ష్మన్ నాయక్, వెంకట నరసింహుడు ప్రముఖులు 1800 నుండి 1807 వరకు పాలేగాళ్లను అణచి వేశారు. 1864లో నొత్సం పాలేగాడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి బ్రిటీష్ వారిపై తిరుబాటు లేవదిశారు. చాగలమర్రికి చెందిన చెంచులతో కలిసి 9వేల మంది సైనికులతో రుద్రవరం, శిరివెళ్లపై దాడి జరిపి తీవ్ర నష్టం చేశారు. మరుసటి దినం కోవెలకుంట్ల ఖజానాను కొల్లగొట్టారు. నరసింహారెడ్డి ని సోమలకొండ వద్ద 1847 జనవరి 9న కోటగుమ్మానికి వేలాడ దీయగా అది దాదాపు 30 సంవత్సరాల వరకు అలాగే ఉండేదని చెబుతారు. 1940 గాంధీ నాయయత్వంలో జరిగిన సత్యాగ్రమంలో చాగలమర్రి వాసులు పాల్గొన్నారు. 1929 మే 21న గాంధీ సతీమణితో కలిసి ఖద్దరు ఉద్యమంలో భాగంగా ప్రొద్దూటూరు నుంచి చాగలమర్రి వచ్చి కేరళా ఆసుపత్రిలో కొద్ది సేపు విశ్రాంతి తీసుకొన్నారు. అనంతరం అమ్మవారి శాల వెనుక భాగాన కళ్యాణ మండపం కట్టిన ప్రదేశంలో ప్రసంగించారు. ఖద్దరు ఉద్యమం కోసం విరాళాలు విరివిగా ఇచ్చి తమ దాన గుణాన్ని చాటుకొన్నారు. ఈ ప్రాంతంలో కుందు, వక్కిలేరు, భవనాసి నదులు ప్రవహిస్తున్నాయి. అటవీ ప్రాంతంలో భైవర కొండలు, మలయాచల దేవాల యాలు తలమానికం అయ్యప్ప దేవాలయం అతిపురా తన ముత్యాలపాడు చర్చి చాగలమర్రికి ఎంతో ఆకర్షనీయం గా నిలిచాయి. నల్లమల కొండల మధ్యగా మాజీ ముఖ్య మంత్రి ఎన్‌టిఆర్ చేపట్టిన తెలుగుగంగ కాలువ ప్రవహిస్తుండడం తో వేలాది ఎకరాలు సస్యశ్యామల మౌతున్నాయి.

జైల్లోనే తొలి పాఠాలు నేర్చుకొన్న ఆర్‌కె. రాం, బండారు నీలన్న

మొదటి సత్యగ్రహ ఉద్యమంలో పాల్గొన్న చాగలమర్రి వాసులు ఆర్‌కెరాం, బండారునీలన్న జైల్లోనే తొలి పాఠాలు నేర్చుకొన్నారు. మహాత్మాగాంధీ చాగలమర్రికి వచ్చిన రోజు వేలాది మంది గుమిగూడారు. ఆసమయంలో బ్రిటీస్ పోలీసులు వీరిని అరెస్టు చేసి నంద్యాల పోలీస్ స్టేషన్ కు తరలించి నాలుగు నెలలు శిక్ష విధించి బళ్లారి కి పంపారు.

అవార్డులు అందుకున్న రైతన్నలు: మండలంలోని రైతన్నలు ఉల్లి, బోప్పాయి పంటలు విరివిగా సాగుచేసి ఇతర దేశాలైన మలేషియా, సింగపూర్, ఇండోనేషియా దేశాలకు ఎగుమతి చేసి రాష్ట్రస్థాయి అవార్డులు దక్కించుకొన్నారు.

సీమకే తలమానికం అయ్యప్ప ఆలయం : చాగలమర్రిలోని పాతబస్టాండ్ కాలనీలోని ఏకశిలా పదునెట్టాంబడి అయ్యప్ప స్వామి ఆలయం సీమకే తలమానికంగా నిలుస్తోంది. భక్తుల విరాళాలతో స్దానిక పాతబస్టాండ్ కాలనీలో సర్వంగా సుందరంగా నిర్మించారు. 1999 వ సంవత్సరం మే 2 వతేదిన శబరిమళ సన్నిధాన ప్రధాన అర్చకులు శ్రీకంఠరామమోహనారు, పందళదేశపు ప్రస్తుత రాజవంశీయులు రాజరాజవర్మ, వేదపండితులు తాళ్ళమాపురం వెంకటశేషయ్య బృందం ఆధ్వర్యంలో ఆలయప్రతిష్ట మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అప్పటి నుండి ఇప్పటి వరకు ప్రతి ఏటా అయ్యప్పమాల ధరించిన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు సుమారు 10 లక్షల మంది అయ్యప్పకు అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు ఆలయకమిటీ వారు తెలిపారు. దూర ప్రాంతాల నుండి వస్తున్న భక్తులకు విడిది సౌకర్యాన్ని కూడా ఏర్పాటు చేస్తున్నారు.

అయ్యప్ప ఆలయం

అతిపురాతన ముత్యాలపాడు చర్చి: మండలం లోని ముత్యాలపాడులో 1884 నవంబర్ 25న అప్పటి చెన్నపట్నం అధ్యక్షుడు శ్రీజల్‌నిర్మించిన చర్చి ఎంతో ప్రతిష్టగా నిలిచింది. దాదాపు 123 సంవత్సరాలు కావస్తున్నా చెక్కు చెదకర పోవడం విశేషం. జిల్లాలోనే ప్రథమంగా చర్చి నిర్మించి సువార్తను ఇక్కడి నుండి ప్రారంభించారు. దొర నిర్మించుకొన్న బంగ్లా నేటి ఎస్‌పిజి ఉన్నత పాఠశాలగా మారింది. 1855లో రాయలపీమ లోనే ప్రప్రథమంగా ప్రాథమిక పాఠశాల, వైద్యశాలను నిర్మించారు. 1884 లో రేవ ఫెడరిక్ బెల్ ద్వారా చర్చికి పునాదిరాయి పండింది. దొర 1806లో 1906లో అఫోక్రిఫా గ్రంధాన్ని తెలుగులోకి అనువదించి 1912లో ఆయన మరణంచారు. ఆయన సమాది ముత్యాలపాడు ఆవరణంలో నేటికి ఉంది. ఇలాంటి ఘన చరిత్ర గల ఆలయాన్ని దర్శించుకోవడారికి విదేశీయులు సైతం ఇక్కడికి వస్తుంటారు. బెత్లహేమ్ పట్టం లో ఉన్న చర్చి నమూనాలో భాగంగా ఏర్పాటు చేశారు.

పర్యాటకులకు కనువిందు చేస్తున్న

నల్లమల అందాలు

- అడవి మధ్యలో రైలు ప్రయాణం
- ఆకట్టుకుంటున్న జలపాతాలు, పచ్చర్ల జంగిల్ క్యాంపు



ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

నల్లమల అటవీప్రాంతం పచ్చని చెట్లతో అలరారుతూ ప్రకృతి ఆరాధకుల మనసును ఆకట్టుకుంటోంది. పేరుకు నల్లమల అయినా పచ్చని అందాలు చూపరులకు కనువిందు చేస్తున్నాయి. నల్లమలలో ఎటు చూసినా ఎత్తైన పచ్చని వృక్షాలు, కొండలు, పక్షుల కిలకిలరావాలు, సెలయేర్లు, జలపాతాలు ప్రకృతి ప్రేమికులను ఆకట్టుకుంటున్నాయి. ముఖ్యంగా దిగువ అహెూబిలం నుంచి ఎగువ అహెూబిలం వెళ్లే 8 కిలోమీటర్ల ప్రాంతం పచ్చని చెట్లతో, సెలయేళ్లతో కనువిందు చేస్తోంది. ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఎగువ అహెూబిలంలోని ఆలయానికి సమీపంలో గరుడాద్రి కొండల నుంచి జాలువారుతున్న జలపాతాలు చూపరులకు కనువిందు చేస్తున్నాయి. అక్కడి నుంచి వంతెన మీదుగా కాలినడకన ఆలయానికి సమీపంలోకి వెళ్లగానే జలపాతాలు, చిన్నచిన్న సెలయేర్లు పర్యాటకులకు ఆనందంతో పాటు ఆధ్యాత్మికభావాన్ని పెంపొందిస్తుంది. అక్కడ నుండి ముందుకు సాగితే ఎటుచూసినా పచ్చని కొండలు ఎత్తైన వృక్షాలు, పక్షుల కిలకిలరావాల మధ్య జలపాతాల సవ్వడి చూపరులను ఇట్టే అకట్టుకుంటున్నాయి. అహోబిలం ప్రాంతంలోని తెలుగుగంగ ప్రధాన కాల్వలో నీరు వుండడంతో ఆదారి గుండా వెళ్లేవారు ఆ పరిసరాల అందాలను ఆస్వాదిస్తున్నారు. అలాగే గండ్లేరు రిజర్వాయర్ కూడా అహెూబిలం నల్లమల ప్రాంతంలో వుండడంతో పర్యాటకులను ఆకట్టుకుంటోంది.

నల్లమలలో జంగిల్ క్యాంపు : నంద్యాల-గిద్దలూరు మీదుగా రాజధాని అమరావతి, విజయవాడకి వెళ్లే దారిలో ఉన్న నల్లమల అటవీప్రాంతంలోని పచ్చర్ల ప్రాంతం పర్యాటకులను ఆకట్టుకుంటోంది. అక్కడ అటవీశాఖ అధికారులు ఏర్పాటు చేసిన ఏకో టూరిజం పర్యాటకులను ఎంతగానో ఆకట్టుకుంటోంది. దీనికి తోడు ఈ ప్రాంతంలోనే సర్వనరసింహస్వామి ఆలయం వుండడంతో అనేక మంది యాత్రికులు ఈ ప్రాంతానికి వచ్చి నల్లమల అందాలను తిలకించి అనంద సాగరంలో మునిగిపోతున్నారు. పచ్చర్లలో పర్యాటకుల కోసం గదులతో పాటు ఇతర సౌకర్యాలను కల్పించారు. పచ్చర్ల విజయవాడకు వెళ్లే రహదారిలో వుండడంతో ఆ ప్రాంతంలోకి వెళ్లే అనేక మంది ప్రయాణీకులు, ప్రకృతి ప్రేమికులు ముందుగానే ఆన్‌లైన్‌లో కాటేజీలు బుకింగ్ చేసుకొని సేద తీరి వెళ్తున్నారు.

వింత అనుభూతిని కలిగిస్తున్న నల్లమల రైలు ప్రయాణం : కర్నూలు జిల్లా నంద్యాల నుంచి ప్రకాశం జిల్లా గిద్దలూరుకు రైలు ద్వారా వెళ్లే మార్గం ప్రయాణీకులకు ఎంతో అనుభూతి, అహ్లాదాన్ని కలిగిస్తుంది. పచ్చని చెట్ల అందాల నడుమ పచ్చర్ల నుంచి దిగువమెట్ట వరకు వెళ్లే రైలు ప్రయాణ అనుభూతి మనస్సును కట్టిపడేస్తుంది. ముఖ్యంగా రెండు ప్రాంతాలలో బొగద (సొరంమార్గం) వుండడంతో రైలు పగటిపూట బొగదలో ప్రయానించే సమయంలో కొద్ది సేపు చీకటి మయం నెలకొంటుంది. ఆ అనుభూతిని ప్రయాణీకులు ఒక తీపి గుర్తుగా అనుకుంటారు. గతంలో పచ్చర్ల నుంచి గిద్దలూరు వెళ్లే రహదారిలో ఎత్తైన కొండల మధ్య నాడు ఉయ్యాల ఊగే వంతెన వుండేది. రైలు ఆ వంతెన పైనుంచి వెళ్తుంటే ప్రయాణీకులకు ఉయ్యాల ఊగినంత అనుభూతి కలుగుతుంది. ప్రస్తుతం ఆ వంతెనను తొలగించడంతో స్ప్రింగ్ వంతెనకు నిర్మించిన ఎత్తైన దిమ్మెలు లోయలో ఇప్పటికీ కనిపిస్తున్నాయి. ఏదేమైనా నల్లమల అటవీ ప్రాంతం పర్యాటకులను కనువిందు చేస్తుందనడంలో సందేహం లేదు.

వినూత్న రీతిలో జిల్లా అభివృద్ధికి చర్యలు

- పేద ప్రజల జీవన ప్రమాణాలు పెంచడమే లక్ష్యం
- ప్రతి ఏడాది 15 శాతం గ్రోత్‌రేటుతో ఐదేళ్ల కార్యాచరణ
- ప్రజాశక్తితో కలెక్టర్ జి.రాజకుమారి

ప్రజాశక్తి-నంద్యాల కలెక్టరేట్

నంద్యాల జిల్లాలో ఉండే స్థానిక వనరులను సమర్ధవంతంగా వినియోగించు కుంటూ ప్రజల జీవన ప్రమాణాలు పెరిగి ప్రతి కుటుంబానికి కనీసం రూ.25 వేల కనీస ఆదాయం వచ్చేలా ఐదు సంవత్సరాల కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా తెలిపారు. ప్రజాశక్తి 44 వ వార్షికోత్సం సందర్భంగా ప్రజాశక్తి తో కలెక్టర్ రాజకుమారి గణియా జిల్లా సమగ్రాభివద్ధిపై జిల్లాలో చేపడుతున్న పలు కార్యక్రమాలను వివరించారు. ఆమె మాటల్లో....

వికసిత్ ఆంధ్ర ప్రదేశ్ 2047 ప్రణాళిక రూపకల్పనలో భాగంగా ఐదు సంవత్సరాల కార్యాచరణ ప్రణాళికపై జిల్లా అధికారులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చాం. జిల్లా, మండల కేంద్రాలలో స్థానికంగా లభ్యమయ్యే దేశీయ ఉత్పత్తులు, వనరులను వినియోగించు కుంటూ ప్రతి ఏడాది 15 శాతం వృద్ధి రేట్ పెరిగేలా కార్యాచరణ రూపొందించి సంక్షిప్త నివేదికలను రాష్ట్ర ప్రభుత్వానికి పంపిస్తున్నాం. అభివృద్ధి సూచికల్లో జిల్లా దిగువ నుండి 5వ స్థానంలో ఉంది. ఎగువ స్థానంలో ఉన్న ఐదు జిల్లాలను పోల్చుకుంటూ ఏ విధంగా అమలు చేస్తే ఆదాయం వస్తుందో అన్వేషించి అధికారులతో నివేదికలు తయారు చేయిస్తున్నాం. ప్రతి డిపార్టుమెంట్ మనం ఏ ప్లేస్‌లో ఉన్నామో సరిచూసుకొని ఏ విధమైన డాక్యుమెంట్ సమర్పిస్తే గ్రోత్ రేట్ పెరగగలదో ఆ మేరకు విస్తృత ఆలోచనలతో నివేదికలు తయారు చేయాలి. పేదరిక నిర్మూలన దిశగానే ఐదు సంవత్సరాల విజన్ డాక్యుమెంటును నివేదికలు ఇవ్వాల్సిందిగా ప్రభుత్వం ఆదేశించిన నేపథ్యంలో అన్ని శాఖలు అమలు చేస్తున్న అంశాలలో కొత్త ఆవిష్కరణలు రూపొందించి ప్రజల ఆర్థిక పరిస్థితులు మెరుగుపడేలా ప్రణాళికలు రూపొందిస్తున్నాం. స్థానికంగా లభ్యమయ్యే వనరులతో ప్రభుత్వానికి ఆదాయం వచ్చేలా యూనిట్లను నెలకొల్పి కృషి చేస్తాం. హార్టికల్చర్ హబ్, టూరిజంహబ్, ఇండస్ట్రియల్ హబ్, 70 వేల హెక్టార్లలో మోనో క్రాప్ అభివృద్ధి చేస్తామనే సంకల్పాలను బలపరుస్తూ మొక్కుబడి రీతిలో కాకుండా అంకితభావంతో పనులు చేస్తున్నాం. జిల్లాలో 158 మందికి మైనింగ్ లీజులకు ఇస్తే పనులు చేయకపోవడానికి గల కారణాలు అన్వేషిస్తున్నాం. జిల్లాలో రకరకాల గ్రానైట్ ఉంది. ప్రమోట్ చేయడంలో ఎందుకు వెనుకబడి ఉన్నాం. మైనింగ్ శాఖ ద్వారా రూ.315 కోట్లు వచ్చే ఆదాయాన్ని రూ.500 కోట్ల వరకు తీసుకువెళ్లాలను కున్నాం. మాతృ శిశు మరణాలు తగ్గించడం, రక్తహీనతను అధిగమించడం, దీర్ఘకాలిక రోగాలు తగ్గించే విధంగా దూర దృష్టితో ముందుకు సాగుతున్నాం. ఆర్వో ప్లాంట్లను తగ్గించి శుద్ధజలం అన్ని గ్రామాలకు సరఫరా చేసేలా ప్రయత్నిస్తున్నాం. అటవీ సంపదను పరిరక్షించుకొనేలా ఎకో టూరిజంను అభివృద్ధి, సంక్షేమ హాస్టళ్లను మెరుగు పరచడం, చేతివృత్తుల పనిముట్లకు ప్రాధాన్యత ఇస్తూ వారి జీవన ప్రమాణాలు మెరుగు పడేలా చర్యలు తీసుకుంటున్నాం. వ్యవసాయం అభివృద్ధిలో పంటల సాగు పెంచేందుకు ప్రస్తుతం సాగయిన దానికి అదనంగా సాగునీటి కాలువల కింద కవరేజ్ కానీ ప్రాంతాలను గుర్తించి ఏ విధంగా అభివృద్ధి చేయగలమో ఆ మేరకు నివేదికలు తయారు చేయిస్తున్నాం.

మహిళా రక్షణకు ప్రత్యేక చర్యలు..

జిల్లాలో మహిళల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. మహిళల పట్ల అఘాయిత్యాలకు పాల్పడే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తాం. తల్లిదండ్రులు పిల్లలను పెంచే విధానంలో మార్పు రావాలి. సొసైటీని

మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి

అర్థ చేసుకునేలా తల్లిదండ్రులు పిల్లలను పెంచాలి. విద్యాతోపాటు వినయం, సమాజంలో విలువలు, సంస్కారం నేర్పాలి. అమ్మాయిల పట్ల తల్లి, సోదరి అనే భావన కలగాలి. కుటుంబం నుండే మార్పు రావాలి. ప్రతి స్కూలులోనూ నైతిక విలువలు పెంపొందేలా ఉపాధ్యాయులు విద్యార్థులకు మెస్సేజ్ ఇవ్వాలి. విద్యార్థులలు చెడును ఎప్పుడైతే విస్మరిస్తారో అప్పుడు ఆడపిల్లల పట్ల అఘాయిత్యాలు వంటివి తగ్గుతాయి.

44 ఏళ్ల ప్రజాశక్తి...

మొదటి పేజీ తరువాయి...

రాష్ట్రవ్యాప్తంగా 10 ఎడిషన్లతో మిగతా పత్రికలకు ధీటుగా పోటీలో నిలబడింది. కర్నూలు జిల్లాలో సమస్యలు, ప్రజాసమస్యలు వెలికితీయడం, ప్రజా పోరాటాలను రూపొందించడంలో ప్రజాశక్తి తనదైన పాత్ర పోషించింది. 1998లో మొదటిసారి కర్నూలులో పిసి సెంటర్‌ను ఏర్పాటు చేశారు. విజయవాడ ప్రచురణ కేంద్రంగా ఉండే ఈ పిసి సెంటర్‌కు కర్నూలు జిల్లాతోపాటు అనంతపురం, కడప జిల్లాల వార్తలు వచ్చేవి. 2003లో కర్నూలులోనే ఎడిషన్ ప్రారంభమై స్థానిక వార్తలకు, స్థానిక ఉద్యమాలకు ప్రాధాన్యమిచ్చేలా 8 పేజీలతో జిల్లా ప్రత్యేక సంచికను తీసుకొచ్చింది. కర్నూలు, మహబూబ్‌నగర్, అనంతపురం జిల్లాలకు కర్నూలులో ఉండే ప్రచురణ కేంద్రం ద్వారానే ప్రజాశక్తి దినపత్రికలు వెళ్లేవి. 2014లో రాష్ట్ర విభజన నేపథ్యంలో తెలంగాణలో ప్రజాశక్తి స్థానంలో 'నవతెలంగాణ' ఏర్పడడంతో కర్నూలులో ఉన్న ప్రజాశక్తి ప్రచురణ కేంద్రం అనంతపురం, కర్నూలు జిల్లాలకు పత్రికలను పంపేది. అన్ని వర్గాల ప్రజల అండతో విస్తరణలో తనదైన ముద్ర వేసుకున్న ప్రజాశక్తి 2017లో అనంతపురంలో కూడా ప్రచురణ కేంద్రం ఏర్పాటవడంతో ప్రస్తుతం కర్నూలులో ఉన్న ప్రచురణ కేంద్రం కర్నూలు జిల్లాకు ప్రచురణ కేంద్రంగా మారింది. కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, వృత్తిదారులు, యువజనులు, మహిళలు ఇలా అన్ని వర్గాలకు ప్రత్యామ్నాయ మీడియాగా ప్రజాశక్తి నిలుస్తోంది. గతంలో కేవలం పట్టణ ప్రాంతాలు, జిల్లా ప్రాంతాలకే పరిమితమైన పత్రిక మారుమూల గ్రామాలకు కూడా వెళు తోంది. జిల్లాలోని 54 మండలాలకు ప్రజాశక్తి వెళుతోంది. వ్యాపార ధోరణికి భిన్నంగా ప్రజల్లో ప్రజాస్వామిక చైతన్యాన్ని రగిల్చే పాత్ర పోషిస్తోంది. వార్తలతోపాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో కూడా ప్రజాశక్తి ప్రత్యేక పాత్ర పోషిస్తోంది.ఉమ్మడి రాష్ట్రంలో కరువు ఏర్పడినప్పుడు అంబలి కేంద్రాలు ఏర్పాటు చేసి పేదల ఆకలితీర్చింది. ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించింది. 2009లో వచ్చిన వరదల సందర్భంగా కర్నూలు, మహబూబ్‌నగర్ జిల్లాల్లో వైద్యశిబిరాలు నిర్వహించింది. సర్వంకోల్పోయిన వారికి స్టౌలు, వంటపాత్రలు, దుస్తులు పంపిణీ చేసింది. శ్రమదానం చేసి కర్నూలు ఓల్డ్‌టౌన్‌లో బురదమట్టిని, చెత్తాచెదారంను తొలిగించింది. వివిధ సందర్భాల్లో ప్రజలకు అవగాహన కల్పించే ప్రత్యేక సంచికలు ప్రచురించింది. అవగాహన సదస్సులు నిర్వహించింది. కరోనా మహమ్మారి విస్తరించిన సందర్భంగా ప్రభుత్వం లాక్‌డౌన్ ప్రకటించింది. అన్నార్థులు, దినసరి కూలీలు తిండిదొరక్క ఇబ్బందులు పడ్డారు. వారి కాలేకడుపులు నింపేందుకు ప్రజాశక్తి సిబ్బంది 15 రోజులు వంటలు చేసి కర్నూలు నగరంలో ప్రధాన కూడళ్లలో ఆహారం అందించారు. రేషన్ కార్డులు లేని కొన్ని కాలనీలను గుర్తించి బియ్యం, పప్పు, మంచినూనె తదితర నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు.

ప్రజాశక్తి కలర్ ప్రింటింగ్ మిషన్‌ను ప్రారంభిస్తున్న అప్పటి కలెక్టర్ ముఖేష్‌కుమార్‌మీన

కరోనా నేపథ్యంలో ఆహార పొట్లాలను పంపిణీ చేస్తున్న ప్రజాశక్తి సిబ్బంది

కర్నూలు ఎడిషన్ ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న కీర్తిశేషులు నగరూరు సుబ్రమణ్యం

శిల్పకళలో ఆళ్లగడ్డ యువ శిల్పి 'ప్రతిభ'

- అమెరికాలోని అట్లాంటాలో.. భద్రాద్రి రామాలయ నిర్మాణం చేస్తున్న యువశిల్పి

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

సహజంగా అమెరికాకు వెళ్లాలని ఎంతో మంది కోరిక. ఆ కోరిక తీర్చుకోవడం కోసం ఎన్నో రకాలుగా ప్రయత్నిస్తుంటారు. కానీ ఆళ్లగడ్డకు చెందిన ఓ యువ శిల్పి తన ప్రతిభతో అమెరికా దేశంలోని అట్లాంటా రాష్ట్రంలో భద్రాద్రి రామాలయం నిర్మించే అరుదైన అవకాశాన్ని పొందాడు.

ఆళ్లగడ్డ పట్టణానికి చెందిన దురుగడ్డ రామకృష్ణమాచారి తనయుడు శ్రీవాణి బాలసుబ్రమణ్యం శిల్ప కళా మందిరం నిర్వాహకులు దురుగడ్డ బాలసుబ్రమణ్యం ఆచారి(బాలు) తండ్రి నుంచి వారసత్వంగా శిల్పకళలో ప్రతిభ కనబరుస్తూ రాణిస్తున్నాడు. ఆయన రాష్ట్రంలోని ఎన్నో ఆలయాలకు రాతి శిల్పాలు తయారు చేసి ఇవ్వడంతో పాటు ఎన్నో ప్రాంతాల్లో ఆలయాలు సైతం నిర్మించాడు. తెలంగాణ రాష్ట్రంలోని యాదాద్రి ఆలయ నిర్మాణంలో పాలుపంచుకునే అదృష్టం దక్కింది. యాదాద్రి ఆలయ నిర్మాణంలో దురుగడ్డ బాలసుబ్రమణ్యం ఆచారి ప్రతిభను గమనించి అమెరికాలోని అట్లాంటాలో భద్రాద్రి రామాలయం నిర్మించడానికి అమెరికాలోని ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యుల బృందం కోరారు. భద్రాద్రి రామయ్య ఆలయ నిర్మాణానికి ఒప్పుకున్న బాలసుబ్రమణ్యం ఆచారి తనదైన శైలిలో ముందుకు సాగి ఆలయ నిర్మాణ

పనులను పూర్తి చేశారు. పట్టణంలోని శ్రీవాణి బాలసుబ్రమణ్యం శిల్పకళా మందిరంలో భద్రాద్రి రామాలయం నిర్మాణం పూర్తయి అమెరికా దేశంలోని అట్లాంటా నగరంలో ప్రతిష్ఠించేందుకు సర్వం సిద్ధం చేశారు. ఇందుకు

సంబంధించి కేంద్ర ప్రభుత్వం సహాయ సహకారాలు అందజేయాలని కోరుతూ యువ శిల్పి బాలసుబ్రమణ్యం ఆచారి, అమెరికా ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యుల బృందం 50 రోజుల క్రితం ఢిల్లీలో కేంద్ర మంత్రులను కలిశారు. ఆళ్లగడ్డలోని శిల్పకళా మందిరంలో నిర్మాణం పూర్తయిన భద్రాద్రి రామయ్య ఆలయ చిత్రాలను కేంద్ర మైనింగ్ శాఖ మంత్రి కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లకు చూపించారు. ఆలయ నిర్మాణం గురించి ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ దృష్టికి తీసుకెళ్లాలని వారు వినతి పత్రం సమర్పించారు. వారు స్పందించి విషయాన్ని ప్రధాన మంత్రి దృష్టికి తీసుకుని వెళ్తామని, భద్రాద్రి రామయ్య ఆలయం విషయంలో తమ సంపూర్ణ సహకారాలు అందిస్తామని శిల్పి దురుగడ్డ బాలసుబ్రమణ్యం ఆచారికి హామీ ఇచ్చారు. ఏది ఏమైనా ఆళ్లగడ్డకు చెందిన శిల్పి తన అద్భుత ప్రతిభతో అమెరికాలోని అట్లాంటాలో భద్రాద్రి రామయ్య ఆలయం నిర్మించే అరుదైన అవకాశాన్ని అందుకున్నాడు. అరుదైన అవకాశాన్ని అందుకున్న దురుగడ్డ బాలసుబ్రమణ్యం ఆచారి తనకు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలుపుతున్నాడు. అట్లాంటాలో ఆలయ నిర్మాణం పూర్తి చేసి అమెరికాతోపాటు ఇతర దేశాల్లో కూడా మరెన్నో అవకాశాలు దక్కించుకోవాలని ఆయన హితులు, సన్నిహితులు, శ్రేయోభిలాషులు కోరుకుంటున్నారు.

ఎస్. లింగందిన్నె అభివృద్ధికి రూ.4 కోట్లతో ప్రతిపాదనలు

ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతా

సర్పంచి ఇరిగెల విశ్వనాథరెడ్డి

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

మండలంలోని ఎస్. లింగందిన్నె గ్రామ అభివృద్ధికి రూ.నాలుగు కోట్లతో గ్రామ సభలో అధికారుల ద్వారా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని గ్రామ సర్పంచి ఇరిగెల విశ్వనాథ్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామంలో సిసి రోడ్లు, సిసి డ్రైన్లు, మొరుసు రోడ్లు అలాగే గ్రామంలో రెండు ఆర్వో ప్లాంట్లు, ఓహెచ్ఎస్ఆర్ ట్యాంక్, వీధిలైట్ల సమస్యలతో పాటు తదితర అభివృద్ధి పనులకు రూ. 4 కోట్లతో ప్రతిపాదనలను అందజేయడం జరిగిందన్నారు. గ్రామంలో ఆరు ప్రాంతాల్లో సిసి రోడ్లు, పది ప్రాంతాల్లో సిసి డ్రైన్లు, 13 ప్రాంతాల్లో మొరుసు రోడ్లు ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు అందజేయడం జరిగిందన్నారు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైన వెంటనే పనులను ప్రారంభిస్తామన్నారు. ఉపాధి పనులను కొందరికి మాత్రమే కల్పిస్తున్నారని అర్హులైన అందరికీ ఉపాధి పనులు కల్పించాలని ఆయన అధికారులను కోరారు. గ్రామ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామన్నారు. ఎస్. లింగందిన్నె గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చి దిద్దుతామని ఆయన స్పష్టం చేశారు.







గాంధేయవాది ఆర్‌కె.రామ్

- మహాత్మునికి సేవలు అందించిన శిష్యుడు
- నిత్య సేవాస్ఫూర్తి సామాజిక చైతన్య దీప్తి

ప్రజాశక్తి - చాగలమర్రి

జాతిపితను చూడటం ఒక గొప్ప అనుభవం. ఆయనను ముట్టుకోవడం అంతులేని ఉత్తేజం. ఆయనతో మాట్లాడడం మహదానందమని భావించే వారు. అలాంటి మహాత్ముడికి సేవలు అందించిన తెలుగు వ్యక్తి ఆర్‌కె.రామ్. ఆయనది నంద్యాల జిల్లాలోని చాగలమర్రి. బాల్యంలోనే మహాత్ముడి శాంతియుత పోరాటాల గురించి విని, చదివి ప్రభావితుడయ్యారు. మనసులో గాంధీ ఆలోచనలు నాటుకుపోయాయి. మహాత్ముడిని కలుసుకోవాలని ఇల్లు విడిచి వెళ్లిపోయారు. నానా కష్టాలు పడి మహాత్ముని సేవాగ్రాం చేరుకున్నారు. అక్కడ ఉంటూ గాంధీతో అత్యంత సన్నిహితంగా మసలుతూ ఆనందించారు. మహాత్మా గాంధీ నవకాశీ యాత్ర చేసినప్పుడు ఆయన వెంట ఉన్న ఏకైక తెలుగువాడు ఆర్‌కె.రామ్ మాత్రమే. మహాత్ముడు మరణాంతరం చితాబస్మాని ఒక ప్రత్యేక రైలులో దేశంలోని ప్రముఖ ప్రదేశాలకంతా తీసుకెళ్లిన బృందంలో ఉన్న ఏకైక తెలుగు వ్యక్తి కూడా ఆయనే కావడం విశేషం.

బాల్యం నుంచి అభ్యుదయ మార్గంలో

ఆర్‌కె.రామ్ పూర్తి పేరు ఆర్‌కె.రామలింగారెడ్డి. ఈయన 1922 మేలో చాగలమర్రి గ్రామంలో జన్మించారు. తల్లిదండ్రులు కొండారెడ్డి, పుల్లమ్మ. ప్రాథమిక విద్య అంతా ఇంటి వద్దనే జరిగింది. ఉన్నత వర్గాలకు చెందిన కుటుంబం కావడంతో ఉపాధ్యాయులు ఇంటి వద్దకు వచ్చి విద్యాబోధన చేసేవారు. తండ్రి కొండారెడ్డికి ఆధ్యాత్మిక, ధార్మిక చింతన బాగా ఉండేది. ఆయన గ్రామంలోని దేవాలయానికి వెళ్లి నిత్యం పూజలు చేసేవారు. అలా ఆర్‌కె.రామ్ కూడా తండ్రి వెంట దేవాలయానికి వెళ్లేవాడు. అయితే అప్పట్లో కుల వ్యవస్థ బలంగా ఉండేది. దీన్ని వ్యతిరేకిస్తూ ఆర్‌కె.రామ్ తన పేరు చివరలోని కులాన్ని వదిలేసి ఆర్‌కె,రామ్‌గా పేరు మార్చుకున్నారు.

ఆర్‌కె.రామ్ (ఫైల్)

సేవా గ్రామ్‌లో మహాత్మునికి సేవకునిగా

1937లో జరిగిన జనరల్ ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున ఆర్‌కె.రామ్ ప్రచారం చేశారు. 17 ఏళ్ల వయసులోనే ఆయన నాటి కాంగ్రెస్ పార్టీ తాలూకా అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 1941లో జరిగిన ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని నాలుగు నెలలు కారాగారవాసాన్ని అనుభవించారు. విడుదల అయ్యాక నేరుగా మహాత్ముని దర్శించేందుకు రైలు బండి ఎక్కారు. రెండు రోజులు ప్రయాణం చేసి పస్తులు ఉండి, చివరికి మహాత్మా గాంధీ సేవాగ్రామ్ చేరుకున్నారు. ఆశ్రమంలో పాకీ పని చేస్తూ గాంధీజీకి రాట్నం సిద్ధం చేస్తూ ఆయనకు అనారోగ్యం కలిగినప్పుడు కంటి రెప్పలా చూసుకుంటూ అత్యంత సన్నిహితుడయ్యారు. మహాత్మా గాంధీ ఎక్కడికి వెళ్లినా రామ్‌ను ఆయన వెంట తీసుకుని వెళ్లేవారు. అలా మధురలోని మీనాక్షి దేవాలయాన్ని సందర్శించడం రామ్ జీవితంలో ఒక మధుర జ్ఞాపకంగా చరిత్రకారులు చెప్తారు.

స్వాతంత్ర్యానంతరం ప్రజాసేవలో

స్వాతంత్రానంతరం 1947లో ఆర్‌కె.రామ్‌ను ఆంధ్ర గ్రంథాలయ మహాసభకు ఆహ్వాన సంఘం అధ్యక్షుడిగా ఎన్నుకుని సముచిత గౌరవం ఇచ్చారు. 1952-53లో సర్వోదయ భూదాన ఉద్యమానికి ఉపసంచాలకులుగా ఆయన వ్యవహరించారు. 1955లో వినోబా భావే ఆంధ్ర ప్రాంతంలో జరిపిన పర్యటనకు రామ్ నాయకత్వం వహించారు. అనంతలక్ష్మిని కులాంతర వివాహం చేసుకొని వర్ణ వ్యవస్థ పట్ల తన మనోభావాలను తేటతెల్లం చేశారు. 1960లో ఇజ్రాయిల్ దేశ పర్యటన జరిపి అక్కడ గోల్డమేర్‌ను కలిశారు. రామ్ లాగే ఆయన ధర్మపత్ని అనంతలక్ష్మి కూడా ప్రజాసేవకే తన జీవితాన్ని అంకితం చేశారు. మహిళా చైతన్యం కోసం అవిటి వారికి విద్యా బోధన కోసం ఎంతో కృషి చేశారు. వయోజన విద్యా కార్యక్రమాలను అమలు చేశారు. రామ్ 1950లో ఆంధ్ర విశ్వవిద్యాలయానికి సెనెట్ సభ్యుడిగా, ఖాదీ గ్రామోద్యోగ బోర్డుకు 1962 నుంచి 1965 వరకు అధ్యక్షుడిగా పని చేశారు. భూదాన్ అనే పత్రికకు సంపాదకుడిగా పని చేశారు. జిల్లా హరిజన సేవక సంఘం అధ్యక్షుడిగా, ఆంధ్ర హరిజన సేవక్ సంఘ్ కార్యనిర్వాహక కార్యదర్శిగా నాటి బడుగు బల హీన వర్గాల అభ్యున్నతికి ఎన్నో సేవలు అందించారు. చాగలమర్రికి హైస్కూల్, ఆసుపత్రి, కళాశాల రావడం కోసం ఎంతో శ్రమించారు. 1985 డిసెంబర్ 3న తన స్వగ్రామం చాగలమర్రిలో ఆయన తుదిశ్వాస విడిచారు. బాపూజి ప్రియ శిష్యునిగా, సంఘ సంస్కర్తగా, అన్నింటికీ మించి ఒక విశిష్టమైన వ్యక్తిత్వానికి సిసలైన చిరునామాగా ఆయన జిల్లా ప్రజల హృదయాల్లో నిలిచిపోయారు.

ఆర్‌కె.రామ్ ఇల్లు

చాగలమర్రి ఏరియల్ వ్యూ





ఆహ్లాదకరం... అహోబిలం

- పర్యాటకులను ఆకట్టుకుంటున్న క్షేత్రం



ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

108 దివ్య క్షేత్రాలలో అహోబిల నారసింహ క్షేత్రం ఒకటి. నల్లమలలో నవనారసింహ క్షేత్రాలు ప్రసిద్ధి. ఈ క్షేత్రానికి నిధి, నగరి అని పేర్లు. తమిళులు అహోబిల క్షేత్రాన్ని శింగవేల్‌కుండ్రం అని పిలుస్తుంటారు. నవనారసింహులు వెలసి నందువల్ల అహోబిల క్షేత్రం నవ నారసింహ క్షేత్రం అని పిలుస్తుంటారు. ఈ క్షేత్రానికి చేరుకునేందుకు జిల్లా కేంద్రం నుండి 134 కిలోమీటర్ల దూరం వుంది. కర్నూలు నుండి ఆళ్లగడ్డకు చేరుకొని అక్కడ నుండి దిగువ అహోబిలానికి 24 కిలోమీటర్లు దూరం ప్రయాణించాల్సి వుంటుంది. అక్కడ నుండి 8 కిలోమీటర్ల దూరంలో నల్లమల అరణ్యంలో శ్రీ నరసింహస్వామి స్వయంభువుగా వెలసిన ఎగువ అహోబిల క్షేత్రం వుంది. ఎత్తైన వృక్షాలతో, పక్షుల కిలకిలా రావాలతో, గలగల పారే ప్రకృతి సెలయేర్ల సవ్వడుల నడుమ అహోబిల అందాలు పర్యాటకులను ఇట్టే ఆకర్షిస్తాయి. ఎగువ అహోబిలం ఆలయ సమీపంలో జలపాతాలు పర్యాటకులను కనువిందు చేస్తాయి. దిగువ అహోబిలం నుండి ఎగువ అహోబిలంకు వెళ్లే రస్తాలో రోడ్డు కిరువైపులా బుసలు కొట్టే విధంగా గాలికి పెద్ద పెద్ద వృక్షాల సైతం ఊగుతూ అహ్లాదకరంగా వుంటాయి. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా నల్లమలలో కొండలపైన నరసింహ స్వామి ఈ క్షేత్రంలో 9 అవ తారాలలో దర్శనమిస్తారు. జ్వాలా, అహోబిల, మాలోలా, క్రోడా(వరాహ), కారంజ, భార్గవ, యోగానంద, ఛత్రవట, పావన(పాములేటి) నరసింహ స్వామిలు వెలసి వున్నారు. నవ నారసింహు లను చేరుకోవాలంటే అత్యంత శ్రమతో కూడుకున్న పని. పూర్వము అహెూబిల క్షేత్రంలో భక్తుల సౌకర్యార్థం రాజులు ఎన్నో కోనేర్లు, బావులు తవ్వించారు. అహెూ బిల క్షేత్రం ఎంతో ప్రాశత్యం సంతరించు కుంది.

స్వాతి దర్శనంతో సకల పాపాలు దూరం : శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి జన్మ నక్షత్రమైన స్వాతి సందర్భంగా నవ నార సింహులను కాలి నడకన దర్శించుకుంటే సకల పాపాలు తొలగుతా యన్నది భక్తుల నమ్మకం. ప్రతి 27 రోజులకు ఒకసారి వచ్చే స్వాతి రోజు వేకువఝాము నుండే భక్తులు నవ నారసింహులను దర్శించు కుంటుం టారు. స్వాతి దర్శనానికి వెళ్లే వారికి పావన, వరాహ, మాలోలా, కారంజ, యోగానంద ఆలయాల వద్ద భక్తులు అన్నదానం ఏర్పాటు చేస్తారు.

పావన క్షేత్రంలో (పాములేటయ్య) వారాలు : ప్రతి సంవత్సరం ఉగాది పండుగ తర్వాత వారం నుండి పాము లేటయ్య వారాలు ప్రారంభమవుతాయి. వారోత్సవాల లో ప్రతి శనివారం వేల సంఖ్యలో భక్తులు పాములేటయ్యకు అరణ్యమార్గం గుండా 10 కిమీ. ప్రయాణించి స్వామికి తమ మొక్కు బడులు తీర్చుకుంటారు. ఊట్ల మీదుగా వెళ్లే రహదారిని అటవీశాఖ దాదాపు రూ. 18 లక్షల వ్యయంతో గుంతలమయంగా వున్న రహదారిని బాగుచేశారు. ట్రాక్టర్లు, లారీలు, జీపులు, మోటర్‌సైకిళ్లపై భక్తులు సులభంగా పావన క్షేత్రం చేరుకోవచ్చు, కాలినడకన వెళ్లే భక్తులు ఎగువ అహెూబిలం చేరుకొని అక్కడ నుంచి మెట్ల మార్గం గుండా అడవిలో కాలినడకన పావన క్షేత్రం చేరుకోవచ్చు. వారోత్సవాలలో కాకుండా ప్రతి శనివారం కూడా భక్తులు తమ తమ వాహనాలలో పావన క్షేత్రం చేరుకొని తమ మొక్కుబడులు తీర్చుకుంటారు.

యోగానందక్షేత్రం (కాశిరెడ్డి నాయన ఆశ్రమం)లో అన్నదానం : నవ నారసింహులలో ఒకరైన యోగానంద నరసింహ క్షేత్రం (కాశిరెడ్డినాయన నెలకొల్పిన ఆశ్రమం)లో గత 30 సంవత్సరాలకు పైగా వచ్చిన భక్తులకు లేదనకుండా నిర్వాహకులు అన్నదానం చేస్తున్నారు. దిగువ అహెూబిల క్షేత్రం నుండి 2 కి.మీ దూరంలో ఈ క్షేత్రం వుంది.

ప్రహ్లాదబడి : హిరణ్యకశ్యపుని కుమారుడు ప్రహ్లాదుడు చిన్నవయస్సులో విద్యాబుద్దులు నేర్చుకున్న చోటు ప్రహ్లాదబడి. మాలోలా ఆలయం నుండి కొంత దూరం ప్రయాణిస్తే ప్రహ్లాదబడి కొండ గుహలో దర్శనమిస్తుంది. అక్కడ అలనాడు ప్రహ్లాదుడు చదువుకొన్న చిన్ననాటి జ్ఞాపకాలలతో పాటు నరసింహస్వామి విగ్రహం కనిపిస్తుంది

ఉగ్రస్తంభం : నవనారసింహులలో ఒకరైన శ్రీ జ్వాలానరసింహస్వామి వెలసిన ఆలయం కొండపై చివరగా ఉగ్రస్తంభం కనిపిస్తుంది. ఈ ఉగ్రస్తంభంకు చేరుకోవాలంటే శ్రమించక తప్పదు. ఉగ్రస్తంభం చుట్టూ తిరిగి స్వామిని దర్శించుకుంటారు.

అహెూబిలేసుని దర్శించుకున్న ప్రముఖులు : ఈ క్షేత్రానికి గతంలో ఉపరాష్ట్రపతి శంకర్‌దయాల్‌శర్మ, మాజీ ప్రధాని దేవగౌడ, గవర్నర్‌లు ఈఎస్‌ఎల్ నరసింహన్, కృష్ణకాంత్, సుశీల్‌కుమార్‌షిండే, ముఖ్యమంత్రులు కోట్ల విజయభాస్కర్‌రెడ్డి, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, అనేక మంత్రులు అహెూబిలేసున్ని దర్శించుకునేందుకు వచ్చారు.

సినిమా షూటింగ్‌లకు నిలయం అహెూబిలం : అహెూబిల క్షేత్రంలో ఎన్నో సినిమాలు రూపుదిద్దుకున్నాయి. అలనాడు ఎస్వీ రంగారావు, ఎన్‌టి రామారావుల నుండి ప్రస్తుతం ప్రభాష్‌ల వరకు ఎందరో కథానాయకులు అహెూబిలంలో చిత్రీకరించిన సినిమాలలో పాల్గొన్నారు. అందులో భాగంగా ఉత్తమురాలు, బందిపోటు భీమన్న, శ్రీ పోతులూరి వీరభహ్మేంద్ర స్వామి జీవిత చరిత్ర, శ్రీ కాశిరెడ్డినాయన జీవిత చరిత్ర, దేవతలారా దీవించండి, దొంగలరాజ్యం, అడవిమనిషి, తోకలేనిపిట్ట, ఒక్కమగాడు, సీమసింహం, శంభోశివ శంభో, మిస్టర్‌ఫర్‌పెక్ట్, అన్నమయ్య, సీతమ్మవాకిట్లో సిరిమల్లెచెట్టు, బంగారి బాలరాజు తదితర చిత్రాలు అహెూబిలంలో రూపుదిద్దుకున్నాయి. ప్రభాష్ నటించిన రాధేశ్యాం సినిమా షూటింగ్ కూడా అహెూబిలంలో జరిగింది.

ఆళ్లగడ్డ శిల్పకళకు అంతర్జాతీయ ఖ్యాతి

- అపరబ్రహ్మలు ఆళ్లగడ్డ శిల్పులు

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

శిల్పకళల గడ్డ ఆళ్ళగడ్డ... కఠినమైన శిలను సైతం అందమైన, ముగ్ద మనోహరమైన శిల్పంగా తీర్చిదిద్దడంలో ఇక్కడి శిల్పులది అందెవేసిన చేయి... శిల్పులు తమ ప్రతిభా పాటవాలను చాటి శిల్పకళలో ఆళ్ళగడ్డకు ఆంతర్జాతీయ స్థాయి గుర్తింపు తెచ్చారు. రాజులు పోయి, రాజ్యాలు అంతరించినా ఆళ్ళగడ్డ శిల్పకళ వైభవం కొనసాగుతునే ఉంది. బండరాళ్ళపై శిల్పాలు చెక్కుతూ సృష్టికి ప్రతి సృష్టి చేస్తూ ఆళ్ళగడ్డ శిల్పులు అపరబ్రహ్మలుగా నిలిచారు. గతంలో వేళ్ళమీద లెక్కించే శిల్పులు ఉన్న ఆళ్ళగడ్డలో నేడు వందల సంఖ్యలో ఉన్నారు. కర్నూలు-కడప జాతీయ రహదారిపై పట్టణశివార్లలో ఒక కాలనీ వెలసిందంటే ఆళ్ళగడ్డలో ఎంతమంది శిల్పులు శిల్పకళపై జీవిస్తున్నారో అర్థమవుతోంది. ఆళ్ళగడ్డ శిల్పకళను పరిశీలిస్తే 1950లో మొదటగా అభినవ జక్కనాచార్య బిరుదాంకితుడు దివంగత దురుగడ్డ బాలవీరాచారి శారదా శిల్పకళా మందిరాన్ని ఏర్పాటుచేసి అనేకమంది శిల్పకళా రంగంపై మక్కువ చూపేలా కృషి చేశారు. ఆయన కుమారుడు దురుగడ్డ రామ కృష్ణమాచార్యులు 5 సంవత్సరాల క్రితం ఉగాది పండగ సందర్భంగా అప్పటి ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు చేతులమీదుగా పురస్కారాన్ని అందుకున్నారు. తండ్రినుంచి నేర్చుకున్న శిల్పకళను అదేబాటలో రామ కృష్ణమాచార్యులు తనకుమారులైన జగదీశ్వరా చారి, బాలమురళీఆచారి, బాల సుబ్రమణ్యం ఆచారి, జయ కృష్ణమా చార్యులను శిల్పులుగా తీర్చిదిద్దారు. శిల్పకళలో 40 సంవత్సరాలకు పైగా అనుభవం ఉన్న రామకృష్ణమాచార్యులు ఎన్నో సత్కారాలను అందుకున్నారు. అలాగే రామకృష్ణమాచార్యులు సోదరుడు రవీంద్రాచారి కూడా శారదా శిల్పకళామందిరాన్ని స్థాపించి అనేకమందికి ఉపాధి కల్పిస్తున్నారు. శిల్పకళలో రవీంద్రాచారి సతీమణితోపాటు, కుమార్తె భువన కూడా రాణించడం విశేషం. రవీంద్రాచారి ఎన్నో అవార్డులను సత్కారాలను అందుకున్నారు. అలాగే రవీంద్రాచారి కుమారుడు శేఖర్‌ఆచారి శిల్పకళలో రాణిస్తున్నారు. వీరే కాక శ్రీ లక్ష్మిశంకర శిల్పకళామందిరం నిర్వాహకులు ఇడమకంటి శంకరాచారి తదితరులు శిల్పకళకు వన్నె తెస్తున్నారు. వీరే కాక ముస్లింలు కూడా శిల్పకళారంగంలో తమ ప్రతిభను కనబరుస్తున్నారు. శ్రీ మహాసాయి శిల్పకళామందిరం నిర్వాహకులు ఖాశింపీరా (బాషా) శిల్పకళలో రాణిస్తున్నారు. ఇలా అనేకమంది ఆళ్ళగడ్డ శిల్పులు శిల్పకళలో రాణిస్తూ ఆళ్ళగడ్డ ఖ్యాతిని అంతర్జాతీయంగా ఇనుమడింపచేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలోని యాదగిరిగుట్ట క్షేత్రాభివృద్ధికి ప్రభుత్వం శిల్పాలను ఏర్పాటు చేసింది. అక్కడ శిల్పాలను ఏర్పాటు చేసే కార్యక్రమాన్ని ఆళ్లగడ్డ శిల్పులకు పనులు అప్పజెప్పారు. వారు పనులను పూర్తి చేశారు. ఈ శిల్పాలను శిల్పులు బాల సుబ్రమణ్యం ఆచారి, జయకృష్ణమా చారి, బాలమురళి ఆచారి, రవీంద్రాచారి, హరిప్రసాద్ ఆచారి, సుబ్రమణ్యం ఆచారి తదితరులు తయారు చేశారు. తెలంగాణాలోని యాదగిరి గుట్ట శిల్పాల నిర్మాణం ప్రారంభం కావడంతో ఆళ్లగడ్డ శిల్పుల ప్రతిభ మరింతగా ఖ్యాతికెక్కింది. కాగా ఆళ్ళగడ్డలో శిల్పకళ శిక్షణా కేంద్రం ఏర్పాటు చేయడంతోపాటు పాఠ్యాంశాలలో శిల్పకళను చేర్చాలని అలాగే బ్యాంకులు శిల్పులకు లోన్లు సకాలంలో ఇవ్వాలని శిల్పులు కోరుతున్నారు. ప్రభుత్వం కూడా సహకారం అందిస్తే శిల్పకళను మరింతగా ముందుకు తీసుకెళ్తామని శిల్పులు తెలిపారు.

శిల్పి రవీంద్రాచారి



శిల్పి జయకృష్ణమాచారి

రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులకు

నందికొట్కూరు గేట్ వే

పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్

ప్రజాశక్తి - పాములపాడు

రాయలసీమ జిల్లాలకు సాగునీటి ప్రాజెక్టులకు నందికొట్కూరు నియోజకవర్గం ప్రధాన ముఖద్వారం నందికొట్కూరు డివిజన్లోని పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్, మల్యాల, ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకాల ద్వారా ఉమ్మడి కడప జిల్లా ,ఉమ్మడి అనంతపురం, ఉమ్మడి చిత్తూరు నెల్లూరు జిల్లాల వరకు సాగునీరు అందుతుంది ఏ ఏ ప్రాజెక్టులు ద్వారా ఎంత నీరు అందుతుంది అన్నది వివరాలు చూద్దాం...

ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం:

ఈ ఎత్తిపోతల పథకం శ్రీశైలం బ్యాక్ వాటర్ నుండి కేసికినాలకు తుంగభద్ర నుండి సాగునీరు అందనప్పుడు ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం ద్వారా కేసి కెనాల్ ఆయకట్టుకు ఐదు టీఎంసీల నీటిని నాలుగు పంపుల ద్వారా 1000 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తారు ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం ద్వారా గతంలో కెసి కెనాల్ ఆయకట్టు కింద ఉన్న రైతాంగానికి తుంగభద్ర నుండి నీరు రానినప్పుడు పంటలు ఎండిపోయే పరిస్థితి ఉండేది ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం ద్వారా ఇప్పుడు కేసి రైతాంగానికి పంటలు ఎండిపోకుండా పండుతున్నాయి ముచ్చుమరి ఎత్తిపోతల పథకం కేసి ఆయకట్టు రైతాంగానికి ఓ వరం లాంటిది...

ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం ద్వారా కేసికినాలకు నీటిని వదిన దృశ్యం

పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్

శ్రీశైలం బ్యాక్ వాటర్ నుండి రాయలసీమ జిల్లాలకు 1 2 గేట్ల ద్వారా 80 వేల క్యూసెక్కుల నీటిని కింది జిల్లాలకు వదిలేందుకు అవకాశం ఉంది. మొదట ఆరు గేట్ల ద్వారా నిర్మించిన పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ అప్పట్లో 44 వేల క్యూసెక్కుల నీరు మాత్రమే కింది జిల్లాలకు వెళ్ళేది కానీ వర్షాలు ఎక్కువ పడి వరదలు వచ్చినప్పుడు నీటిని వృధాగా సము ద్రంలో కలవకుండా రాయలసీమ లోని రిజర్వాయర్లు, చెరువులను నింపుకునే ందుకు అవకాశంగా ప్రభుత్వాలు ఎస్సార్ ఎం సి కాలువలను విస్తరణ చేసి 80 వేల క్యూసెక్కులు నీటిని కింది జిల్లాలకు పంపించేందుకు కాలువలన విస్తరణ పనులు చేయడం జరిగింది. ప్రధానంగా పోతి రెడ్డిపాడు నుండి 16 కిలోమీటర్ల దూరంలో ఉన్న బానకచర్ల క్రాస్ హెడ్ రెగ్యులేటర్ వరకు 80 వేల క్యూసెక్కుల నీరు కాలువలో వచ్చే విధంగా విస్తరణ చేపట్టారు. అక్కడ నుండి ఎస్సార్ బీసీ, ఎస్కేపి, టిజిపి, గాలేరి నగరి సృజల స్రవంతి కాలువల ద్వారా నీరు వెళుతుంది. బానకచెర్ల క్రాస్ హెడ్ రెగ్యులేటర్ నుండి మూడు కాలువల ద్వారా క్రింది జిల్లాలకు నీరు వెళు తుంది. ఏయే కాల్వ ద్వారా ఎంత నీరు వెళు తుంది.

గాలేరి నగరి సృజల స్రవంతి (ఎస్ఆర్‌బిసి)

ఈ కాల్వ సామర్థ్యం మొదట 22 వేల క్యూసెక్కుల నీరు పంపించేందుకు వీలుగా ఉండేది ప్రస్తుతం ఈ కాలువ సామర్థ్యం 30 వేల క్యూసెక్కుల నీరు అందించేందుకు విస్తరణ చేపట్టారు. ఈ కాలువ ద్వారా అలగనూరు రిజర్వాయర్, అవుకు రిజర్వాయర్, గోరుకల్లు, మీదుగా కడప జిల్లా గండికోట పైడిపాలెం డ్యాములకు రాయలసీమ జిల్లాలకు ఈ నీరు అందుతుంది.

పై కాలువల విస్తరణ పనులన్నీ కూడా పూర్తి కాలేదు. విస్తరణ పనులు, లైనింగ్ పనులు అన్ని పూర్తి చేసుకున్నట్లయితే అధిక వర్షాలు కురిసినప్పుడు రాయలసీమ చెరువులు రిజర్వాయర్లు అన్నిటిని నింపుకున్న ట్లయితే వర్షాలు కురవక ఒక సంవత్సరం కరువు వచ్చినప్పటికీ రాయలసీమకు ఎలాంటి ఇబ్బందులు ఉండకపోవచ్చు ..

ఎస్‌కెపి ఛానల్ (నిప్పుల వాగు)



ఎస్కేపి ఛానల్ (నిప్పుల వాగు)

ఈ కాలువ ద్వారా మొదట 11 వేల క్యూసెక్కులు నీరు అందించే సామర్థ్యం కలిగి ఉన్న ఈ కాలువను 35 వేల క్యూసెక్కులు నీరు కింది జిల్లాలకు అందించేందుకు కాలువ విస్తరణ పనులు చేపట్టారు. ఈ కాలువ క్రింద ఆయకట్టు చాలా ఉన్నది ఎస్కేపి ఛానల్ ద్వారా ఈ కాలువ కేసీకినాల్లో కలిసి కుందులో చేరి కింది జిల్లాలకు కండలేరు వరకు సాగునీరు అందించుకుంటూ వెళుతుంది.

తెలుగు గంగ (టిజిపి) కాలువ

ఈ కాల్వ ద్వారా మద్రాస్‌కు తాగునీరు 11వేల క్యూసెక్కుల నీరుఅందించేందుకు కాల్వ సామర్థ్యం ఉంది. మొదట చెన్నైకి తాగునీరు అందించేందుకు ముఖ్య ఉద్దేశం ఉన్నప్పటికీని ఈ కాలువ ద్వారా వెలుగోడు రిజర్వాయర్ అలాగే కింది జిల్లాలకు చెరువులను నింపుకోవడం రాయలసీమ జిల్లాలలో సాగునీరు అందించుకుంటూ చెన్నై వరకు ఈ కాలువ వెళుతుంది. ఇప్పుడు ప్రస్తుతం ఈ కాలువ ద్వారా 15వేల క్యూసెక్కులు నీరు వెళ్లేందుకు లైనింగ్ పనులను చేపట్టారు.



మద్రాస్ కాలువ (టి జి పి)

హంద్రీనీవా సృజన స్రవంతి ఎత్తిపోతల పథకం ద్వారా నీటిని విడుదల చేసిన దృశ్యం (ఫైల్ ఫొటో)

హంద్రీనీవా సృజల స్రవంతి ఎత్తిపోతల పథకం (హెచ్ ఎన్ ఎస్ ఎస్)

హంద్రీనివా సృజన స్రవంతి కర్నూల్ పశ్చిమ ప్రాంతం అనంతపురం చిత్తూరు జిల్లా వరకు పూర్తిగా వర్షాధారమైన వ్యవసాయ భూములకు ఈ ఎత్తిపోతల పథకం ఓ వరం లాంటిది నందికొట్కూర్ డివిజన్లోని మల్యాల నుండి దాదాపు 291 కిలోమీటర్ల ఎత్తుకు కర్నూలు అనంతపురం చిత్తూరు జిల్లా వరకు ఈ కాల్వ వెంట ఎనిమిది పంపులతో కృష్ణా జలాలను తోడిపొస్తూ కరువు సీమను శశ్యామలం చేస్తుంది. ఈ కాల్వ ద్వారా 10 లక్షల మందికి త్రాగునీరు కర్నూలు జిల్లాలో 80 వేల ఎకరాలకు సాగునీరు అనంతపురం జిల్లాలో 1 లక్ష,18 వేల ఎకరాలకు మొత్తం 1, లక్ష 98 వేల ఎకరాలకు సాగునీరు దాదాపు 120 గ్రామాలలో 10 లక్షల మందికి తాగునీరు అందుతుంది. ప్రస్తుతానికి ప్రధాన కాలువ ఎనిమిది లిఫ్టుల ద్వారా నీటిని తోసి పోస్తున్నారు. ప్రధాన కాలువకు లైనింగ్ పనులు ప్రస్తుతం చేపట్టలేదు. ఈ నీటి విడుదల ప్రతి సంవత్సరం ఆగస్టు నెల నుండి నవంబర్ వరకు విడుదల చేస్తారు. మల్యాల ఎత్తిపోతల పథకం ద్వారా ఈ నీటిని విడుదల చేస్తారు. 12 పంపులు ఉన్నప్పటికిని అయిదు లేదా ఆరు పంపుల నీరు వెళ్లేందుకే కాల్వ సామర్థ్యం ఉన్నది భవిష్యత్తులో విస్తరణ చేస్తే మరింత నీటిని రాయలసీమ జిల్లాలకు పంపించే అవకాశం ఉంది.

వైద్య రంగంపై సమగ్ర సమీక్ష అవసరం

– ప్రజారోగ్య వేదిక నాయకులు బిఎల్ఎన్.ప్రసాద్‌శర్మ

ప్రజాశక్తి-ప్రత్యేక ప్రతినిధి కర్నూలు

'వైద్యం సామాన్యునికి అందుబాటులో ఉండాలి. పెరిగిన టెక్నాలజీ దృష్ట్యా అధునాతన సాంకేతిక పరికరాలను ప్రభుత్వ ఆస్పత్రులతో ప్రభుత్వమే కొని ఏర్పాటు చేయాలి. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ విధానం, కేంద్రం ప్రభుత్వ తెచ్చిన వెల్‌సెంటర్స్ పద్ధతిని పటిష్టంగా అమలు చేయాలి. ఫారిన్ తరహాలో రెఫరల్ సిస్టమ్ రావాలి. వైద్యం పట్ల ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలి. అన్నింటిని మించి వైద్య రంగంపై సమగ్ర సమీక్ష చేయాలి. ఇవన్ని అమలు కావాలంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైద్యానికి బడ్జెట్‌లో తగినన్ని నిధులు కేటాయించాలి.' అని కర్నూలు ప్రజారోగ్య వేదిక నాయకులు బిఎల్ఎన్.ప్రసాద్‌శర్మ పేర్కొన్నారు. ఆయన మాటల్లో...

ప్రాథమిక ఆరోగ్యం కేంద్రాలు 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉంటున్నాయి. ప్రధానంగా మందులు ఉండటం లేదు. సిబ్బంది నియామకాల్లేవు. సీజనల్ వ్యాధులు బాగా పెరుగుతున్నాయి. తగిన మందులు లేవు. వైద్యులు, నర్సులు, సబ్‌స్టాఫ్ చేస్తున్న కృషికి సపోర్టుగా మందులు, పరికరాలు అందుబాటులో ఉంచాలి. బీపీ ఆపరేటర్లు, ఇసిజి మిషన్లు లేవు. ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో వైద్యం చేసే వారి నుంచి పైకి రెఫర్ చేసే సిస్టమ్ సరిగ్గా లేదు. మొబైల్, సూపర్ స్పెషాలిటీ సౌకర్యం కల్పించాలి. విజిట్స్ పెట్టాలి. ప్రత్యేక క్లీనిక్ నడపాలి. నెలకు ఒక సారి సర్జన్, ఫిజీషియన్ విజిట్ చేయాలి. ఇలాంటి స్థాయి వైద్యులు లేని చోట తప్పక నియమించాలి. జిల్లాలో రక్తహీనత పెరిగింది. ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలి. మహిళలకు ప్రత్యేకించి రాపిడ్ టెస్టులు చేపించాలి. రక్తంలో హిమోగ్లోబిన్ సరైన స్థాయిలో ఉండేలా చూడాలి. ప్రభుత్వ వైద్యం బలోపేతానికి రిటైర్డ్ వైద్యులతో కమిటీ ఏర్పాటు చేయాలి. కలెక్టర్లు, నిష్ణాతులైన వైద్యులతో కమిటీ ఏర్పాటు చేయాలి. ప్రభుత్వ వైద్యశాలలో ఎమర్జెన్సీ, క్యాజువాలిటీలో ఐదు రకాల సౌకర్యాలు ఉండాలి. సర్జికల్, మెడికల్, గైనిక్, సూపర్ స్పెషాలిటీ సౌకర్యాలతో పాటు డిఎం స్థాయి వైద్యాధికారి పర్యవేక్షణ ఉండాలి. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో పడకలకు తగిన సిబ్బంది లేరు. ప్రధానంగా ఎమర్జెన్సీలో యుద్ధప్రాతిపదికన సౌకర్యాలు కల్పించాలి. తమిళనాడు, కేరళ తరహాలో మారుమూల ప్రాంతాలకు కూడా వైద్యం అందించేలా యంత్రాంగం ఉండాలి. ప్రభుత్వాలు మారినప్పుడల్లా వైద్యరంగంలో మార్పులు రాకూడదు. స్థిరమైన విధానం ఉండాలి. టిబి వ్యాధిగ్రస్తులు పెరుగుతున్నారు. పౌష్టికాహార లోపం, ఆ జబ్బు వచ్చిన వారిపై సరైన పర్యవేక్షణ లేకపోవడం వల్ల తగ్గడం లేదు. ప్రయివేటు వైద్యశాలలో ఆరోగ్యశ్రీ సేవలు బాగునప్పటికీ ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతో అవినీతి పెరిగింది. దానిని అరికట్టాలి. ప్రభుత్వం కంటి వైద్యంపై ప్రత్యేక క్యాంపులు నిర్వహించాలి. హిమోఫిలియా మందులు అందుబాటులో ఉంచాలి. వలసలు వెళ్లే వారి దీర్ఘకాలిక వ్యాధులను గుర్తించి వారికి మందులు అందించాలి. మారిన కాలంలో గుండె జబ్బులు, బీపీ, షుగర్ లాంటి జబ్బులు దరిచేరకుండా ఉండాలంటే వ్యాయామం, పౌష్టికాహారం, రోగ నివారణ చర్యల మీద అవగాహన పెంచుకోవాలి. వైద్యం కంటే ముందస్తు చర్యలు తీసుకోవడం ఉత్తమం. ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు పౌష్టికాహార వస్తువులను పంపిణీ చేయాలి.

వైద్యం మానవుని జీవన సరళిలో ప్రధానంగా మారింది. గతంతో పోలిస్తే వైద్యులపై ఆధారపడే జనాభా పెరిగింది. శ్రమతగ్గడం, టెక్నాలజీ పెరిగి వృత్తిపరంగా ఒత్తిడి పెరగడం పౌష్టికాహార లోపం, ఆహారంలో మార్పులు ప్రధాన కారణం. వెయ్యి మందికి ఒక డాక్టర్ ఉండాలని గతంలో డబ్ల్యుహెచ్ఒ చెప్పింది. హాలోపతి, హోమియోపతి, ఆయుర్వేదం లేదా ఆయుష్, యునాని ఇతర ప్రభుత్వం గుర్తించిన వైద్యం, వైద్యులు అందుబాటులో ఉన్నారు. ప్రపంచీకరణ తర్వాత ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ తగ్గింది. ఫ్యామిలీ డాక్టర్ విధానం ఉండాలి. ఎవిడెన్స్ మెడిషన్ పద్ధతి అనేది వచ్చింది. ఒక డాక్టర్ దగ్గరకు రోగి వచ్చినప్పుడు పూర్వాపరాలు, జీవన శైలి తెలుసుకోవాలి. అది తగ్గింది. 90 శాతం మంచి వైద్యం అందించే వైద్యులు వచ్చారు. వ్యాపార ధోరణి ఉన్నా రోగికి మేలు చేయాలనే చూస్తున్నారు. అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ పెరిగింది. ప్రభుత్వం దానిని కొనలేని స్థితిలో ఉంది. పెట్టుబడిదారులు కొంటున్నారు. రోబోటిక్ యంత్రాలు వచ్చాక ఆధిపత్య వైద్యం పెరిగింది. గతంలో సోషల్ ఓరియంటేషన్ పద్ధతి ఉండేది. సామాజిక దృక్పథం, ఛారిటీలతో నడిచే వైద్యకేంద్రాలకు గుర్తింపు పోయింది. ప్రభుత్వం ఆధునిక టెక్నాలజీని ఉపయోగించాలి. ప్రభుత్వ వైద్యశాలలను పటిష్ట పరచాలి. ప్రైమరీ హెల్త్ కేర్ సెంటర్ ద్వారా ప్రివెంటివ్, ప్రమోషన్ గుండెకు సంబంధించిన జాగ్రత్తలు తీసుకోవాలి. వెల్‌నెస్ సెంటర్స్ పద్ధతిని కేంద్రం ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ప్రధానంగా ఆరోగ్యానికి బడ్జెట్‌లో నిధులు పెంచాలి.